సంచిక 3 - సెప్టెంబర్ 2021

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ



# లీసా ఇండియా

**సంచిక 3, సెప్టెంబర్ 2021**

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.


**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**

నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in



| | |
|---|---|
| **లీసా ఇండియా** | ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు. |
| **చీఫ్ ఎడిటర్** | కె.వి.యస్. ప్రసాద్ |
| **మేనేజింగ్ ఎడిటర్** | టి.యమ్. రాధ |
| **అనువాదం** | రామ శేషు సూరంపూడి |
| **అనువాద సమన్వయం** | వీణ మార్కాండే |
| **అడ్మినిస్ట్రేషన్** | రుక్మిణి జి. జి. |
| **డిజైన్ లేఔట్** | శ్రీ సాయిరామ్ క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్ |
| **ముద్రణ** | బ్లూస్ట్రీమ్ ప్రింటర్స్, బెంగళూరు |
| **కవర్ ఫోటో** | మల్టీ లేయర్డ్ ఫార్మింగ్ |
| **ఫోటో క్రెడిట్** | జి.ఇ.ఎ.జి. |


## లీసా మేగజైన్

**ఇతర ఎడిషన్లు**

లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు ఈస్ట్ ఆఫ్రికన్ ఎడిషన్

## లీసా ఇండియా మేగజైన్

**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**

హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ


ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.



మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్ధ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. టి.ఎం. త్యాగరాజన్, |
| | | డా. ఎ. రాజన్న, |
| | | డా. స్మిత ప్రేమ్‌చందర్ |
| | | శ్రీ అశోక్ చటర్జీ |
| | | శ్రీమతి రేణుకా చిదంబరం |
| కోశాధికారి | : | శ్రీ ఎస్.జి. హెగ్డే |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ టి.ఎమ్. రాధ |


## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్దిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియమైన పాఠకులకు

లీసా ఇండియా సెప్టెంబర్ 2021 సంచికను మీ ముందుకు తీసుకురావడం చాలా సంతోషం కలిగిస్తోంది. ఈ సంచికలో ప్రధానంగా నేటి కోవిడ్ 19 కరోనా రోజులలో, ప్రజల రోగనిరోధక శక్తిని పెంపొందించే లక్ష్యంతో సామాజికపరంగా చేపట్టవలసిన తక్షణ చర్యలను గురించి వివరించేందుకు ప్రాధాన్యం ఇచ్చాం.

కోవిడ్ 19 కరోనా బెడద సమయంలో రోగ నిరోధక శక్తి పెంపు అంశానికి ప్రాముఖ్యత ఉన్నది. ఇలాంటి ప్రాధాన్యత ఎన్నడూ ఎదురుకాలేదు. కేరళ రాష్ట్రంలోని వ్యవసాయదారులు, సాధారణ పౌరులు అందరూ ఈ దిశగా అనేక ప్రయోగాలు చేస్తున్నారు. సురక్షితమైన ఆహారం అందించేందుకు వీలుగా పెరటి తోటల పెంపకం, ఇండ్ల మిద్దెలపై కూరగాయల పెంపకంపై సామాన్యులకు, రైతులకు కూడా ఆసక్తి పెరిగింది. థానాల్ సంస్థ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం 'ప్రాజెక్టు ఫుడ్' కింద పల్లె ప్రాంతాలలోని చౌడు భూములు కూడా కూరగాయల పెంపకానికి ఆసువుగా మారిపోయాయి.

ఇక లాక్‌డౌన్ కాలంలో సురేశ్ ఖన్నా వంటి వారు తమ ఇండ్ల పెరడు నేలల్లోనే కూరగాయల పెంపకం చేపడుతున్నారు. కమ్యూనిటీల భాగస్వామ్యంతో చేపట్టిన కొన్ని చర్యలు అందుబాటులో ఉన్న ప్రతి అంగుళం జాగాను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా చైతన్యాన్ని, అవగాహన పెరుగుతోంది. పెరళ్లలోని జాగా, రైతుల కృషి, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన పెరిగింది. పట్టణ వినియోగదారులలో పెంపొందిన చైతన్యం, దానికి కొండంత అండగా నిలిచిన కమ్యూనిటీ పరమైన చర్యలు, గిరాకీకి తగినట్లుగా వస్తులభ్యతను పెంపొందించాయి. ఫలితంగా వ్యవసాయం సుస్థిరమైన లాభసాటి జీవనోపాధిగా మారింది.

దేశం మొత్తం మీద వాడి, లోకాలిషియస్ వంటి ప్రయోగాత్మక చర్యలు విస్తరిస్తున్నాయి. పోషక విలువలుండేలా తోటల పెంపకం, స్థానికంగానే కూరగాయల సాగు ఆలోచనలు కార్యరూపం దాలుస్తున్నాయి. ఇవి మరింతగా విస్తరిస్తే పోషక విలువల లభ్యత, ప్రజారోగ్యం కమ్యూనిటీ శ్రేయస్సు. సాంస్కృతిక సహజీవనం, పర్యావరణం విషయాలలో మంచి ఫలితాలు సాధించవచ్చు. పౌరులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించే లక్ష్యంతో వైవిధ్యంతో కూడిన ఆహార పదార్థాలను సాగుచేయడం, అనువైన విధంగా తోటల పెంపకం తక్షణ అవసరం. ఈ సంచికలోనే ప్రస్తావించిన మరో ముఖ్యమైన అంశం - డిజిటల్ ప్లాట్ ఫారమ్ - జనని గ్రో మొబైల్ యాప్. ఇది రైతులకు చాలా సేవలు అందిస్తోంది. పునరుత్పాదనక సేద్య విధానాలను పరిచయం చేయడంతో పాటు సేంద్రీయ ఉత్పత్తులకు మరింత గిరాకీ తెచ్చే విధంగా మార్కెట్ వ్యవస్థలను పటిష్టం చేయడం ద్వారా వ్యవసాయదారులకు ఎంతో సహాయం చేస్తోంది.

ఈ సంచిక మీ అందరి ఆదరణను పొందగలదని విశ్వసిస్తున్నాం. మీ అమూల్యమైన సూచనల కోసం ఎదురుచూస్తున్నాం.

**సంపాదకులు**




**పోషకాలతో వన సంపద - లక్ష్మీ ఉన్నిథాన్**


కోవిడ్ 19 కరోనా వైరస్ విజృంభణతో యావత్ ప్రపంచం విలవిలలాడిపోతోంది. అన్ని దేశాలలోను సమస్యల సుడిగుండాలు జన జీవితాలను ఛిన్నాభిన్నం చేసివేస్తున్నాయి. ఆ వైరస్ పరోక్ష ప్రభావం నుంచి బయటపడేందుకు రకరకాలుగా పోరాటాలు సాగిస్తున్నాయి. **4**






**స్థానికంగా కూరగాయల ఉత్పత్తి - ఉషా ఎస్, మంజు ఎం. నాయర్, దేవికా ఏ.ఎస్**

కోవిడ్ 19 కరోనా వైరస్ విజృంభిస్తున్న నేటి కాలంలో రోగనిరోధక శక్తికి ఇదివరలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళలోని సాధారణ పౌరులతో పాటు సామాన్య వ్యవసాయదారులు కూడా రోగనిరోధక శక్తి సాధనకు సురక్షితమైన ఆహారాన్ని ఇంటి పెరటి తోటల్లోనే సాగుచేసేందుకు.. **6**



**పర్యావరణ అనుకూల సేద్యం - ఉషా దేవి వెంకటాచలం**

డిజిటల్ మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మన చుట్టూ సహజసిద్ధమైన వేదికలు చాలానే ఉన్నాయి. ఇప్పుడు కృషి జనని పేరుతో తమిళనాడు రాష్ట్రంలోని వ్యవసాయదారులకు ప్రత్యామ్నాయ వేదికను అందిస్తోంది. **10**


**ఇది మా తోట - అది మా జీవితం - సురేశ్ ఖన్నా**

''మీకు కావలసిన ఆహారాన్ని మీరే పండించుకోండి'' అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న ఆధునిక దృక్కోణం. ఈ ఆలోచన పట్టణాలలోనూ, నగరాలలోనూ విస్తరిస్తోంది. పట్టణీకరణ ప్రభావం వల్ల చెత్త పేరుకుపోవడం ఫలితంగా కాలుష్యం ప్రబలడం సర్వసాధారణ నగర జీవితంగా మారిపోయింది. **15**


**నగరాల్లో సేద్య కార్యకలాపాలకు ప్రోత్సాహం - దెబోరా దత్త**

పరిశ్రమ రూపంలో సాగుతున్న వ్యవసాయ కార్యకలాపాల ప్రభావంతో భూసారం దిగజారిపోతున్న వాస్తవాన్ని గుర్తించి ఆహార పదార్థాల ఉత్పాదన, వినియోగం వంటి అంశాలపై నగరాలలోనే కేంద్రీకృతమై ఉండే మేధావులు తమ ఆలోచనల్లో మార్పులు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. **17**

# పోషకాలతో వన సంపద

**లక్ష్మీ ఉన్నిథాన్**

కోవిడ్ 19 కరోనా వైరస్ విజృంభణతో యావత్ ప్రపంచం విలవిలలాడిపోతోంది. అన్ని దేశాలలోను సమస్యల సుడిగుండాలు జన జీవితాలను ఛిన్నాభిన్నం చేసివేస్తున్నాయి. ముఖ్యంగా జీవనోపాధులను కోల్పోయిన పేదలు, నిరుద్యోగం తో విసిగి వేసారి పోతున్న యువత, అన్ని వర్గాలలోనూ ఆకలి కేకలు, ఆరోగ్యపరమైన సమస్యలు చికాకు పెడుతున్న రోజులివి.

లాక్ డౌన్ నిబంధనలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేశాయి. రైతులకు సహకరించేందుకు ప్రభుత్వం కొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. కానీ, ఆహార పదార్థాల సరఫరా చెయిన్‌లో ఏర్పడిన అడ్డంకులు దేశవ్యాప్తంగా రైతులను తీవ్రం గా దెబ్బతీశాయి. స్వల్పకాలం నిల్వ ఉండే పంట దిగుబడిని కోత కోయడంలోనూ, వాటిని మార్కెట్‌కు చేర్చి తగిన లాభాలు పొందడంలోనూ వారు చాలా సమస్యలనే ఎదుర్కోవలసి వచ్చింది. ముఖ్యంగా సరకు రవాణాకు కీలకమైన కూలీల సమస్య, రవాణా వాహనాల సమస్యలతో పాటు మార్కెట్‌లు పని గంటలు తగ్గిపోవడం వల్ల ఎక్కువ నష్టపోవలసి వచ్చింది.

కోవిడ్ భయం పెరిగిపోయిన సమయంలో మరికొన్ని అంశాలను ఎవ్వరూ పట్టించుకోలేదు. వాటిలో ముఖ్యమైనది - వాతావరణ మార్పులు అత్యంత ప్రభావం చూపించాయి. నీటి కొరత, భూసార క్షీణత తీవ్ర సమస్యలుగా మారాయి. ఇవి ఆహార పదార్థాల సరఫరా చెయిన్ భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేశాయి. పర్యావరణపరంగా ఎదురవుతున్న ఈ సమస్యలకు పంటల సాగులో వైవిధ్యం కొంత వరకు పరిష్కారమే అని చెప్పాలి. ముఖ్యంగా కేలరీల పరంగా సుసంపన్నమైన ధాన్యాలకు (కేలరీ-రిచ్) బదులుగా పోషక సమర్థమైన (న్యూట్రిషన్-రిచ్) ఆహార పదార్థాలను పండించే అంశానికి అధిక ప్రాధాన్యత కనిపిస్తోంది. సుస్థిరమైన రవాణా వ్యవస్థ మాత్రమే ఆహార పదార్థాల సరఫరా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ప్రేరణ కాగలదు. లాక్ డౌన్ సమయంలో పరిశుభ్రమైన ఆహారం అది కూడా పోషక విలువలు సమృద్ధిగా ఉన్నది ఎలా సంపాదించడం అనేదే పెద్ద సమస్యగా కనిపించేది. మన జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా సమీకృత ఆహారానికి బదులుగా బర్గర్లు, పిజ్జాలు దాని స్థానం ఆక్రమించాయి. ఇదివరలో మనం ఇంటి వెనక పెరట్లో పండించిన కూరగాయలనే ఎక్కువగా ఆహారంలో తీసుకునేవాళ్లం. కేరళలో ఇప్పటికీ చాలా ఇండ్లలో ఇలా పెరటి తోటలు పెంచడం కనిపిస్తుంది.

దేశమంతటా కూడా పోషక విలువలతో కూడిన తోటల పెంపకం, స్థానిక కూరగాయల పెంపకం వంటి అంశాలకు



*బాడీ ప్రాంతంలో మహిళలు పోషకాలను సమృద్ధిగా అందజేసే కూరగాయల సాగుపై దృష్టి పెట్టి తోటల పెంపకం చేపట్టారు*

ఉద్యమంలా చాలా కార్యక్రమాలే జరుగుతున్నాయి. దీనిని ఆచరణలో పెట్టినట్లయితే ప్రజల ఆరోగ్యం, అందుకు అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహారం, సామాజిక ఆరోగ్య పరిస్థితి, సంస్కృతి పర్యావరణం అందుతాయి.

ఉదాహరణకు ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించింది. బాడి ప్రాంత అభివృద్ధి కార్యక్రమంలో సముచిత స్థానం కల్పించింది. నార్వా గారూ - ఎ గురువాటాడి కార్యక్రమం సిద్ధం చేసింది. ఇండ్ల వెనుక ఉండే పెరళ్లలో తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే ఆహార భద్రత, పోషక ఆహారం సమకూర్చే కృషిలో భాగంగా అవసరమైన మార్పులు చేర్పులు చేయాల్సి ఉంది.

ప్రధాన్ అనే సంస్థ తరఫున అర్పణ్ భట్టాచార్జీ, అజయ్ గుప్తా (అగ్రికల్చర్ వరల్డ్ మేగజైన్‌లో జూన్ 2020)న వెలుగులోకి తెచ్చిన నివేదికలో సోమీ బాఘెల్ అనే రైతు ఆదర్శవంతమైన అనుభవాన్ని గురించిన ప్రస్తావన ఉంది. ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర బస్తర్ ప్రాంతానికి చెందిన ఒక సన్నకారు రైతు. నాబార్డ్ అందించే అనేక కార్యక్రమాల సహాయంతో జిల్లా ఉద్యాన శాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రదాన్ సంస్థ మద్దతుతో ఆ మహిళా రైతు అద్భుత ఫలితాలు సాధించారు. బాడి ప్రాంత అభివృద్ధికి ఇవన్నీ సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమాలలో అవసరమైన సేద్య శిక్షణతో పాటు సాంకేతిక అంశాలను ఆమె అవగాహన చేసుకున్నారు. వాటి సాయంతో ఆమె గౌరవప్రదమైన ఆదాయం పొందుతున్నారు.

ఇక్కడ అందించిన శిక్షణ, సాంకేతిక నైపుణ్యాల సాయంతో సోమీ తన ఇంటి ఆవరణలోనే పెరటి తోటల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారం పండించుకుంటున్నారు. ఇతర

గిరిజన కుటుంబాలన్నీ కూడా ఇదే విధంగా తమ ఇండ్ల ఆవరణల్లోనే మొక్క జొన్న, చిరుధాన్యాలు, పోషక విలువలున్న కూరగాయలు పండించుకుంటూ ఉంటాయి. సోమి కూడా అదే పద్ధతి అనుసరించింది. వారి పెరటి తోటల్లో అనాస, మునగ, ఇంకా పొట్లకాయ, అనపకాయ, ఆకు కూరలు పెంచుకుంటున్నారు. ఇవి ఆహారంలో భాగంగా నిత్యం కుటుంబాలకు పోషకాహారం అందించడమే కాక అవసరమైనప్పుడు అంతో ఇంతో ఆదాయం కూడా తెచ్చిపెడతాయి. ఈ ప్రాంతంలో గిరిజన రైతు కుటుంబాలు చాలా ఉన్నాయి. వారిలో చాలా మంది మహిళలే. పల్లె ప్రాంతాలలోని కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో పెరటి తోటల ప్రయోజనాలపై జరిగిన పరిశోధనలు నిరూపించాయి. కోవిడ్ అనంతర కాలంలో ఇలాంటి కార్యక్రమాలపై మహిళా రైతులు చాలా చాలా ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా ఆహార భద్రతకు భరోసా ఇస్తోంది.

లొకాలిషియస్ అనే ఉద్యమం ప్రధానంగా లోకల్ ఆహార పదార్థాల ప్రాధాన్యతను ప్రచారం చేసేందుకు ప్రారంభమైంది. దీనిని పాండిచ్చేరిలో ఆరోవిల్లీ ప్రాంతంలో కృష్ణ మెకంజీ అనే ఆయన తన సోలిట్యూడ్ కేఫ్ కేంద్రంగా ప్రారంభించారని చెప్పాలి. స్థానికంగా వాడుకలో ఉన్న ఆహార పదార్థాలను పండించడం తేలిక. పుష్కలంగా పోషకాలు అందిస్తాయి. ఆర్థికంగా ఏ మాత్రం భారం కానందున ప్రతి ఒక్కరికి సాధ్యమే అవుతాయి. సామాజిక తోటల పెంపకంలో భాగంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క రోజు తోటల పెంపకంపై దృష్టి పెట్టి శ్రమపడితే చాలు ఆకు కూరలు, దుంపకూరలు, ఇతర రకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఆహారాన్ని పోషక సమృద్ధం చేసి ఆరోగ్యప్రదాతలుగా నిలుస్తాయి. భూసారం మెరుగుపడుతుంది కూడా.

గుజరాత్‌లో ఉత్థాన్ అనే సంస్థ తమ పరిసరాలలోని వివిధ సమాజాలలోని కుటుంబాలతో సత్సంబంధాలు పెట్టుకుని వారికి అవసరమైన కూరగాయలను అందిస్తోంది. కోవిడ్ సమయంలో పల్లె ప్రాంతాలలోని కుటుంబాలకు తగినంతగా కూరగాయలు లేదా నాణ్యమైన విత్తనాలు సరఫరా కావడం లేదని ఈ సంస్థ గుర్తించింది. అసలే చేతిలో నగదు కొరత సమస్య కారణంగా చాలా కుటుంబాలు కూరగాయల సాగుపై దృష్టి పెట్టలేదు. వాటి వినియోగం కూడా నిర్లక్ష్యం చేశాయి. దీని ప్రభావం మహిళలపైనా, చిన్నారులపైనా ఎక్కువగా పడింది. ఇంటి మగవారికే కూరగాయలతో కూడిన ఆహారం అందేది. స్వయంగా భూమి లేని కుటుంబాలు పెరటి తోటల పెంపకం కూడా సాధ్యం కాక ప్రయత్నించనేలేదు.

ఈ పరిస్థితిని గమనించి 53 గ్రామాలలోని 2514 కుటుంబాలకు పెరటి తోటల సాగుకు అనువైన కిట్స్ సరఫరా చేశారు. తీర ప్రాంతంలోని 864 కుటుంబాలకు, గిరిజన ప్రాంతాలలోని 1650 కుటుంబాలకు ఆరు రకాలైన కూరల సాగు విత్తనాలను అందజేశారు. అవసరమైన బయో ఫెర్టిలైజర్స్ సమకూర్చే బాధ్యతను మహిళా సంఘాలు తీసుకున్నాయి. వారికి అందించిన కిట్ సాయంతో అందుబాటులో లేదా పెరడులో ఉండే 1000 నుంచి 1500 చదరపు అడుగుల స్థలంలో మొక్కలు పెంచడానికి సరిపోతాయి. స్థానిక అవసరాలపై అధ్యయనం చేసిన తరువాత బెండ, క్లస్టర్ బీన్స్, నల్ల మచ్చ చిక్కుడు, బీరకాయ, కాకరకాయ, పొట్లకాయ విత్తనాలను ఉత్థాన్ కార్యకర్తలు అందులో అందించారు. వారికి గ్రామస్థాయి వాలంటీర్లు సహకరించారు. ముఖ్యంగా మాస్కులు, గ్లౌవ్స్, భౌతిక దూరం పాటింపు వంటి విషయాలలో రైతులను చైతన్యపరిచారు. పంచాయతీ అధ్యక్షులు లేదా పెద్దల మద్దతు కూడగట్టారు. ఉత్తమ విధానలలో భాగంగా వాటి గురించిన ప్రచారాలను కరపత్రాలు, వీడియోల రూపంలో రైతులకు చేరువ చేశారు. జీవ సంబంధ క్రిమి సంహారకాల వాడకం, వాటి తయారీపై సుస్థిర సేద్య విధానాల శిక్షణలో భాగంగా మహిళా రైతులకు అవగాహన కల్పించారు.

ప్రజలను చైతన్యపరిచే కృషి ప్రభావంతో తోటి కుటుంబాలకు సహకరించాలనే సదాశయంతో 2514 కుటుంబాలు ముందుకు వచ్చాయి. వారు 7500 కుటుంబాలకు అండగా నిలిచేందుకు సంసిద్ధత చూపాయి. ముఖ్యంగా భూమి లేనివారు, సొంతంగా నీరు, భూ వసతి లేనందున సేద్యం చేసుకోలేని కుటుంబాలకు వారి సాయం లభించింది. ఈ రకంగా రోజుకు 750 గ్రాముల మేరకు పోషక విలువలున్న ఆహారాన్ని 7500 కుటుంబాలకు రెండున్నర నెలల పాటు అంటే గత ఏడాది జూన్ మధ్య నుండి సెప్టెంబర్ వరకు అందించగలిగారు. వారు అందించిన రోజుకు 700 గ్రాముల పోషకాలు ఆరుగురు సభ్యులున్న కుటుంబ అవసరాలను తీర్చగలదు. ఇలాంటి ఉద్యమ రూపాలు అన్ని చోట్లా విస్తరించడం చాలా అవసరం. పోషక విలువలున్న తోటల పెంపకం మాత్రమే దీనికి పరిష్కారం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మహిళలు, చిన్నారులకు అవసరమైనంత పోషకాహారం అందించడం చాలా అవసరం. అందుకు స్థానికంగా కూరల పెంపకమే సరైన మార్గం. ◆

**Lakshmi Unnithan**
Editor - Agriculture World
Head PR & Communication
KRISHI JAGRAN, DSR AGRI MEDIA PVT LTD
60/9, 3rd Floor, Yusuf Sarai Market
Near Green Park Metro Station,
New Delhi-110016
E-mail: dr.lakshmi@krishijagran.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 22, సంచిక 4, డిశెంబర్ 2020

# స్థానికంగా కూరగాయల ఉత్పత్తి

**ఉషా ఎస్, మంజు ఎం. నాయర్, దేవికా ఏ.ఎస్**

**కోవిడ్ 19 కరోనా వైరస్ విజృంభిస్తున్న నేటి కాలం లో రోగనిరోధక శక్తికి ఇదివరలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళలోని సాధారణ పౌరులతో పాటు సామాన్య వ్యవసాయదారులు కూడా రోగనిరోధక శక్తి సాధనకు సురక్షితమైన ఆహారాన్ని ఇంటి పెరటి తోటల్లోనే సాగుచేసేందుకు రకరకాలుగా చొరవ తీసుకుంటున్నారు. ఆరోగ్యానికి మేలు చేసేవాటిని, పోషకాలు సమృద్ధిగా ఉండే పదార్థాలను తమ రోజువారీ భోజనంలో ఉండేలా చూసుకుంటున్నారు.**



*సేంద్రీయ కూరగాయల సాగు అంశంలో పీజీఎస్ సంస్థ ధృవీకరణ పొందిన మహిళా రైతు సాజి కుమారి*

ఇరవై ముప్పయ్ సంవత్సరాలుగా కేరళ రాష్ట్రంలో పట్టణ జీవన శైలితో వినియోగదారుల ఆలోచనల్లో మార్పులు శరవేగంగా పెరుగుతూ వస్తున్నాయి. ఇక పది పదిహేనేళ్లుగా మా సంస్థ థానాల్, ఇంకా మరికొన్ని సంస్థలు సేంద్రీయ కూరగాయల ఉత్పత్తికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఫలితంగా పట్టణ వాసులలోనూ, ఆరోగ్యానికి అధిక ప్రాముఖ్యం ఇచ్చే వారిలోనూ కనీసం కొన్ని రకాల కూరగాయలనైనా తమ పెరటి స్థలాల్లోనే కాకుండా తాము నివసిస్తున్న ఇండ్లపై కప్పుల మీద పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వారిలో కొందరు తమ మిగులు ఉత్పత్తిని ఇరుగు పొరుగు వారికి, వారాంతపు మార్కెట్లకు సరఫరా చేయగలుగుతున్నారు.

## కోవిడ్ 19 – మారిన పోకడ

కోవిడ్ 19 కరోనా వైరస్ విజృంభణ, పర్యవసానంగా ఎక్కడపడితే అక్కడ విధించిన లాక్ డౌన్ పరిస్థితులు అనివార్యమైన కొన్ని మార్పులకు దారితీసాయి. లాక్ డౌన్ వంటి అనిశ్చిత పరిస్థితులను తట్టుకునేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఆహారం విషయంలో స్వయంసమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. అంటే రాష్ట్ర ప్రజల అవసరాలకు తగినంత స్థానికంగా ఉత్పత్తి జరగాలని ఆయన సూచించారు. ముఖ్యంగా కూరగాయలు, ఆహారంలో భాగమైన దుంపల సాగు విరివిగా సాగాలని కోరారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.వాసుకి కూడా ఆహారోత్పత్తి విషయంలో స్థానిక రైతులను, యువ కార్యకర్తలను విస్తృతంగా ప్రోత్సహించారు. గత మూడు నెలల కాలంలో సమగ్ర ఆహార భద్రత ప్రాజెక్టు ప్రేరణతో ఇంటి పెరళ్లలోనూ, నిరుపయోగంగా వదిలేసిన మెట్ట భూముల్లోనూ సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం ప్రతి కుటుంబం కూడా తమ అవసరాలకు సరిపడా కూరగాలయలను తామే స్వయంగా పండించుకోగలగాలి. అలాగే తమ అవసరాలకు తగినంతగా పశుసంపద పెంచుకోవాలి. ఈ ప్రయత్నంలో స్థానిక మీడియా సంస్థలు చురుగ్గా పాల్గొని ప్రజలను ప్రోత్సహించాయి. కూరగాయల పెంపకం, తోటల పెంపకం వంటి కార్యకలాపాలకు వ్యవసాయ శాఖ నుంచి విత్తన సరఫరా పెద్ద ఎత్తున జరిగింది. కొన్ని రైతు సంఘాలు మరో అడుగు ముందుకేసి, అవసరమైన విత్తనాలను సరఫరా చేసాయి. వీటిని మామూలు వ్యవసాయ కార్యకలాపాలుగా పరిగణించకూడదు. కాని, అంత శ్రద్ధతోనూ, అవసరమైన ఎరువులు (గో పేడ ఆధారిత పొడి రూపం లోనివి), క్రిమిసంహారకాలు (ఔషధ మొక్కలు, వేప నూనె, కాంతారి చిల్లీ, వెల్లుల్లి, సోపు మిశ్రిత కషాయం రూపంలో) విస్తృతంగా ఉపయోగంలోకి వచ్చాయి. ఉత్పత్తి అయిన ఆహార పదార్థాలను ఇరుగు పొరుగుతో కలిసి పంచుకున్నారు. ఇది లాక్ డౌన్ సమయంలోనే కాకుండా ఆ తరువాతి రోజులలో కూడా కొనసాగడం విశేషం. ఇప్పుడు ప్రజలు తమ పెరళ్లలో చైనీస్ బంగాళా దుంపలు, చేమ దుంపలు (కోలోకాసియా), కర్ర పెండలం (టపైకా), కంద దుంపలు (ఎలిఫెంట్ ఫుట్ యామ్) వంటివి పెరళ్లలోనే పండిస్తున్నారు.

## చౌడు భూముల్లో ఆహార పదార్థాల ఉత్పత్తి

థానాల్ సంస్థ గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో రైతుల ప్రయోజనాల కోసం వారితో కలిసి కృషి సాగిస్తోంది. ఇందు

కోసం ప్రాజెక్టు ఫర్ ఫుడ్ స్కేప్ (ఆహార ఉత్పత్తి భూములు) రూపకల్పన కోసం గత ఏప్రిల్‌లో చేపట్టింది. నిరుపయోగంగా వదిలేసిన భూములను ఆహార పదార్థాల ఉత్పత్తికి అనువుగా మార్చివేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రజల నుంచే సేకరించడం రైతుల చేతికి పంట వచ్చిన తరువాత తిరిగి వారికే ఆహార పదార్థాల రూపంలో తిరిగి అందించడం దీని ప్రత్యేకత.

ఈ లక్ష్యం సాధించేందుకు రైతులకు, ఆసక్తి గల యువతకు అవసరమైన ముడి సరుకులు అంటే విత్తనాలు, బయో మాన్యువర్స్, చీడపీడల నివారణకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, అందుకు పర్యావరణ అనుకూల సేద్య పద్ధతులనే అనుసరించేలా ప్రోత్సహించడం ప్రధానమైన అంశాలు. ఇప్పటి వరకు అంటే ఈ రెండు నెలల కాలంలో 800 మంది రైతులకు ఈ రకంగా అవసరమైన ముడి సరుకులు అందించడం సాధ్యమైంది. సేంద్రీయ సేద్య విధానాలపై శిక్షణ ఇవ్వగలిగారు. ఇందులో భాగంగా రెండు జిల్లాల్లోని అట్టప్పడి (పాలక్కాడ్ జిల్లా), నారనమూజి (పట్టణంతిట్ట జిల్లా) గ్రామాలలోని గిరిజన తెగ వారిని కూడా భాగస్వాములుగా ప్రయోజనం పొందారు. ఈ జిల్లాల్లో గత 20-30 సంవత్సరాల కాలంలో ఆహార ఉత్పత్తి దారుణంగా క్షీణించిపోయింది. అందుకు చాలా కారణాలే ఉన్నాయి.

అట్టప్పడి పరిసరాలలోని 19 గ్రామాలలో 2019 నుంచి ఇది అమలవుతోంది. పర్యావరణ అనుకూల సేద్యం ద్వారా పోషక సమృద్ధి సాధన అని ఈ కార్యక్రమానికి పేరు పెట్టి అమలుచేస్తున్నారు. దీనిని అమలుచేయడంలో రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ శాఖ నుంచి పూర్తి సహకారం లభిస్తోంది. ఈ ప్రాంతంలో పంచ కృషి పేరుతో సంప్రదాయకంగా అమలులో ఉన్న వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడం దీని లక్ష్యం. ఈ ప్రయత్నానికి రైతులలోని వయోవృద్ధులైన స్త్రీపురుషులందరూ తమ మద్దతు తెలిపారు. ఉత్సాహం చూపించారు. ఈ పంచ కృషి విధానంలో చిరుధాన్యాలను పండించడం ప్రధానమైన అంశం. సరైన జీవనోపాధి లేని విద్యావంతులైన యువతకు ఇందులో భాగస్వామ్యం కల్పించడం జరిగింది. వారిలో కొందరు కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. పంచ కృషి సేద్య విధానంతో పాటు పర్యావరణ అనుకూల సేద్య విధానాలపై కూడా వారు అవగాహన పెంచుకునేందుకు ఆసక్తి చూపించారు. దేశీయ విత్తనాలను, వృద్ధుల అనుభవాల ఆధారంగా సంప్రదాయక సేద్య విధానాలను సంరక్షించే లక్ష్యంతో వారు పెద్దెపల్లె (విత్తన ధాన్యాగారం) పేరుతో ప్రాజెక్టు ప్రారంభించారు. తోటి రైతులకు తోడ్పడడమే దీని ఉద్దేశం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న సామాజిక ప్రకృతి సహజ సేద్య విధానాల గురించి అంతర్గత చర్చలలో వారు తెలుసుకున్నారు. ఈ విధానంపై వారంతా ఆసక్తి చూపించారు.

## థానాల్ స్ఫూర్తితో సేంద్రీయ కూరల పెంపకం

మొట్టమొదట 2001లో తిండివనం జిల్లా (తమిళనాడు)లోని రెండు గ్రామాలలోని రైతులతో కలిసి మేము పనిచేయడం ప్రారంభించాం. సేంద్రీయ పద్ధతులలో సేద్యం చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా కేరళలోని కోవలం ప్రాంతంలో ఉన్న మహిళా రైతుల సాయంతో చేపట్టాం. అప్పట్లో కేరళలో క్రిమిసంహారకాల వినియోగంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండేది. ముఖ్యంగా ఎండోసల్ఫాన్ పరిణామాలపై థానాల్ సంస్థ అక్కడి రైతులకు పూర్తి అవగాహన కల్పించింది. ఈ సమయంలోనే రసాయనిక క్రిమి సంహారకాల అవసరం లేకుండానే సేద్యం చేయవచ్చని నిర్ధారణ అయింది. ఆహారోత్పత్తి, స్వయంసమృద్ధి అంశాలపై శాస్త్రవేత్తలలో విస్తృతంగా అధ్యయనాలు జరిగేవి. కేరళలో రైతులంతా చిన్న కమతాల యజమానులే. అందువల్ల ఈ లక్ష్యాలు సాధించేందుకు చిన్న కమతాల వల్ల ఆశించిన ఫలితాలు సాధించడం కష్టంగా ఉండేది. అయినా అలాంటి చిన్న చిన్న కమతాలలో ఏ మేరకు దిగుబడులు సాధించవచ్చనేది అధ్యయనాలలో కీలకమైన అంశంగా ఉండేది. కూరగాయల సాగు వల్ల సమృద్ధిగా దిగుబడి సాధించవచ్చునని గుర్తించడం జరిగింది. కేరళ రాష్ట్రంలో వాతావరణపరంగా సానుకూలతలు ఎక్కువే. అంతేకాక, భూసారం కూడా మెరుగ్గా ఉంటుంది. అందువల్ల పండ్లు, కూరగాయల సాగుకు ఇది అన్ని విధాలా అనుకూలమేనని నిర్ధారణ అయింది. అధ్యయనాలను ఆధారం చేసుకుని చిన్న కమతాలున్న మహిళా రైతులతో మూడు స్వయంసహాయక బృందాలు ఏర్పాటయ్యాయి. ఏడాది కాలంలోనే వారు అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఫలితాలు గమనించిన తరువాత అక్కడి పంచాయతీ అధికారులు థానాల్ నిర్వాహకులను ఆహ్వానించారు. ముఖ్యంగా సేంద్రీయ పద్ధతులలో కూరగాయలను, అరటి తోటలను పెంచడంపై వారు థానాల్ మార్గదర్శకం కోరారు. ఆ తరువాత మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సహకారంతో ముందుకెళ్లడం సాధ్యమైంది.

దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు చాలా మంది ముందుకు వచ్చారు. అయితే అనుకోకుండా ముందుకొచ్చిన కోవిడ్ 19 పరిణామాలు పెద్ద అడ్డంకిగా నిలిచాయి. మొదటి సారి లాక్‌డౌన్ సమయంలో కీలకమైన సభ్యులతో విస్తృతంగా చర్చలు సాగించాం. లాక్ డౌన్ తొలగింపు తరువాత, ప్రాజెక్టు ఫుడ్ స్కేప్ (ఆహార ఉత్పత్తి భూములు) ప్రాజెక్టు చేపట్టాం. దేశీయ సేద్య విధానాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి ప్రాముఖ్యాన్ని గుర్తించిన చాలా మంది రైతులు తమ మద్దతు తెలిపారు. అయితే ఆర్థిక వనరులు సమస్యగా మారింది. ప్రారంభంలో ఎకరాకు కనీసం రూ.5000 అవసరమని వారు అంచనా వేశారు. థానాల్ సంస్థ చొరవ తీసుకుని అవసరమైన నిధులు సేకరించింది. హితులు, వినియోగదారులు తమ వంతు చేయూత అందించారు. వారు

అందించిన ఆర్థిక సహాయాన్ని ధాన్యరూపంలో కానీ, పప్పు ధాన్యాల రూపంలో కానీ, కూరగాయల రూపంలో గానీ తిరిగి చెల్లించేందుకు అవగాహన కుదిరింది. అయితే చాలా మంది తమకు బదులు తీర్చవలసిన అవసరం లేదని సహృదయం చాటుకున్నారు.

థానాల్ బృందం సహాయంతో రైతులు భూమిని దుక్కిదున్ని పదును చేసి సిద్ధం చేశారు. కొంత భూమిని వారు కౌలుకు కూడా తీసుకున్నారు. సేంద్రీయ పద్ధతిలో సేద్యం మొదలుపెట్టారు. ఇతర రైతులకు కూడా వారు తమ వంతు చేయూత అందించారు. ఇందులో భాగంగా రైతులకు పూర్తి అవగాహన ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో చీడపీడల నివారణ, జీవసంబంధ (బయో) ఎరువుల తయారీపై అవగాహన కల్పించేందుకు ఆరు సెషన్ల నిడివితో శిక్షణ ఇచ్చారు. అదే విధంగా ఇతర సంస్థల ఆధ్వర్యం లో జరిగే ఆన్‌లైన్ శిక్షణ తరగతుల నిర్వహణలో కూడా థానాల్ తోడ్పడింది. ఈ తరగతుల్లో ప్రకృతి సహజసిద్ధంగా సేద్యం చేయడంపై అవగాహన కల్పించడం సాధ్యమైంది.

పత్తనంతిట్ట జిల్లాలోని గిరిజనులు ఉపాధి కోసం వేరు చోట్లకూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కోవిడ్ 19 కారణంగా ఎక్కడా వారికి ఉపాధి లభించలేదు. ఈ స్థితిలో 480 మంది సేద్యం మొదలుపెట్టారు. 13 రకాలైన కూరగాయల పెంపకం చేపట్టారు. సేంద్రీయ పద్ధతులనే అనుసరించారు. వారికి ముందుగానే ఆయా అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. అయితే ఆ సమయంలోనే భారీ వర్షాలు కురవడంతో చాలా మంది సేద్యం లో కొనసాగలేకపోయారు. అయితే ఇప్పుడు వారిలో కొం తమందిని ఎంపిక చేసి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## సామాజిక వంటశాలలు

స్థానికంగానే ఆహారం తగినంతగా ఉత్పత్తి అవుతున్న నేపథ్యం లో లాక్ డౌన్ సమయంలో చాలా పంచాయతీలు సామాజిక వంటశాలలను ఏర్పాటు చేసి ఆకలి కేకలు వినిపించకుండా అడ్డుకోగలిగారు. త్రివేండ్రం జిల్లా కరక్కుళం పంచాయతీలో ఇలాంటి సామాజిక వంటశాల మొట్టమొదట ఏర్పాటైంది. ఇది నగరానికి చేరువగానే ఉన్నా చాలా మంది చిన్న, మధ్యకారు రైతు కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. ఈ కృషిలో పంచాయతీ నుంచి పూర్తి మద్దతు లభించింది.

దాదాపు 130 మంది రైతులకు, వారిలో మహిళలే అధికం, సేద్య పరికరాల కిట్ ఒక దానిని అందించాం. వాటిలో వేరు వేరు రకాల కూరగాయల విత్తనాలు ఉన్నాయి. ఇంకా బయో ఇన్‌పుట్స్ కూడా తగినంతగా ఉన్నాయి. ముందుగా రెండు సార్లు వారికి శిక్షణ ఇచ్చారు. వాటి ఫలితంగా సేంద్రీయ సేద్యంలో భాగంగా కూరగాయల పెంపకానికి అనువుగా భూసారం పెంపొందించే ప్రక్రియలను వారు అవగాహన చేసుకున్నారు. కోవిడ్ కారణం గా ప్రయాణాలపై ఉన్న ఆంక్షల కారణంగా, కొంతకాలం పాటు అప్పటికే నమోదు చేసుకున్న రైతులతో ముఖాముఖీ సంప్రదించే అవకాశం లేకపోయింది. అయినా సరే, వారు తమకు తాముగా ముందుకొచ్చి సేద్యం పనులు మొదలుపెట్టారు. ఆ సమయం లో రైతులకు సహాయపడేందుకు వీలుగా మొబైల్ ఆధారిత సేంద్రీయ సేద్య సలహా సంప్రదింపుల విధానాన్ని ప్రారంభిం చగలిగారు.

## ఒక సవాలుగా – మా పెరట్లో తోటల పెంపకం

కోవిడ్ ప్రభావం వల్ల చాలా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా వారితో నేరుగా చర్చించే అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. మా కార్యకర్తలు వారికి అవసరమైన సూచనలు, అవసరమైన పత్రాలు అందించడం కష్టమైంది. ఆ రకంగా పూర్తి స్థాయిలో వారిలో సేంద్రీయ సేద్యం విషయంలో వారికి చేయూత అందలేదు.

ఆ సమయంలోనే ఈ సరికొత్త పంథా - మా పెరట్లో తోటల పెం పకం - కార్యక్రమాన్ని వాట్సప్ బృంద రూపంలో ప్రారంభించడం జరిగింది. సేద్యానికి సంబంధించిన ఫొటోలు మాత్రమే కాకుండా రైతుల సమస్యలు, చీడపీడల నివారణ విధానాలు, భూసారాన్ని కాపాడే విధానాలు, పరిమిత పొలంలో ప్రయోజనాలు పొందే మార్గాలు మొదలైనవి రైతులకు చేరువ చేయగలిగారు. ఇది వారికి చాలా ఆసక్తి కలిగించింది. ప్రతి ఒక్కరూ కూడా తమ విజయగాథలను ఈ వాట్సప్ గ్రూపులోని ఇతర సభ్యులతో పం చుకోగలిగారు. ఇక్కడ రెండు ఉదాహరణలు గమనిద్దాం.

‘‘కూరగాయల పెంపకం కోసం థానాల్ చేపట్టిన ఈ కార్యక్రమం లో నేను 12 ఏండ్ల కిందట భాగస్వామి అయ్యాను. గత ఏడాది నా మకాం మరో చోటికి మార్చిన తరువాత ఇంటి మిద్దెపై ముందుగా కూరల పెంపకం మొదలుపెట్టాను. థానాల్ సంస్థ నుంచి అందిన విత్తనాలను మా ఇరుగుపొరుగు వారితో కలిసి పంచుకున్నాను. వారిని కూడా ప్రోత్సహించాను. నా వరకు బెం డకాయలు, మిరపకాయలు, వంకాయలు, బీరకాయలను సాగుచేశాను. ఇప్పుడు కూడా మేము విత్తనాలను, మొక్కలను పంచుకుంటున్నాము. పంట పొలాన్ని కూడా కలిసి ఉపయోగిం చుకుంటున్నాము. మా మధ్య చక్కటి అనుబంధం ఏర్పడింది. కొంతవరకు ఇదివరకే వ్యవసాయ అనుభవం ఉన్నందున థానాల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణ్ సహకారంతో జీవసంబంధిత క్రిమి సం హారకాలను, ఎరువులను తయారుచేయడంలో కూడా నైపుణ్యం సంపాదించుకున్నాను. ఆయన మంచి సలహాసూచనలు అందించేవారు. ఇప్పుడు మా పరిసరాలలో ఇతరులను కూడా భాగస్థులను చేసేందుకు థానాల్ మొబైల్ ఆధారిత సేద్య సలహా కేంద్రం సహాయంతో శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాం. ముందుగా కోవిడ్ ప్రభావం అదుపులోకి రావాల్సి

ఉంది. దాని కోసమే ఎదురుచూస్తున్నాం. అప్పుడే మేము పూర్తిగా స్వయంసమృద్ధి సాధించగలుగుతాము.'' అంటున్నారు కోవలం సమీపంలోని వెల్లార్ గ్రామానికి చెందిన ప్రమీల.

ఈ సందర్భంలో స్థానిక సేంద్రీయ మార్కెట్ మేనేజర్ దీవక్ ఈ విధంగా తమ అభిప్రాయాలు తెలియచేశారు. ''మేము ఏడు మంది సభ్యులం ఒక బృందంగా ఏర్పడ్డాం. మాలాగే సేంద్రీయ సేద్యం చేస్తున్న తోటి రైతు దగ్గర నుండి ఒకటిన్నర ఎకరా భూమిని కౌలుకు తీసుకున్నాము. వేనాడు సేంద్రీయ క్షేత్రాలు పేరుతో వ్యవసాయం పనులు ప్రారంభించాం. అరటి, అల్లం, పసుపు, తీపు బంగాళా దుంప, పెండలం (యామ్), చేమ దుంపలు (టారో) మాత్రమే కాకుండా టమేటా, మిర్చి, వంకాయ, కాకరకాయ, పొట్లకాయ (ఐవీ గార్డు), గుమ్మడి కాయ, ఆనప కాయ వంటివి సాగు చేస్తున్నాం. ఇన్ పుట్స్ కోసం పెట్టుబడి అవసరం లేకుండా చేస్తున్న సాగు కారణంగా మేము స్వయం సమృద్ధికి చేరువ అయ్యాం. అంటే పొలం పనులను మేమే చేసుకుంటున్నాం. మొక్కల పెంపకం చేపడుతున్నాం. ఈ మొక్కలను పెరట్లో విత్తనాలు నాటి పెంచుకుంటున్నాం. బయో ఎరువులను, క్రిమిసంహారకాలనే తయారుచేసుకుంటున్నాము. మట్టి పాదులు చేయడంతోపాటు పొలంలోనే ఉన్న చెరువులో చేపల పెంపకం చేయగలుగుతున్నాం. దగ్గరలోని కాలువల నీటిని వినియోగించుకుంటూ పెండలం, చేమ, అరటి సాగు చేస్తున్నాం. వీటి మధ్యలోనే వంకాయ మొక్కలు, పసుపు, అల్లం, దోసకాయ మొక్కలను పెంచుతున్నాం. ఈ అంతర్ పంటల సాగు వల్ల క్రిమి నాశనం అదనపు ప్రయోజనంగా ఉంటుంది. ప్రస్తుతం సేంద్రీయ మార్కెట్లలో సమృద్ధిగా లేని అరటి పండ్లను, ఇతర కూరగాయలను పండించి స్వయంసమృద్ధి సాధించాలని ఆలోచిస్తున్నాం. మొక్కల పెంపకానికి అనుకూలమైన మట్టిని ఇతరులకు సరఫరా చేసి అంతో ఇంతో ఆదాయం కూడా సంపాదిస్తున్నాం. మేమంతా కూడా కనీసం ప్రతి రోజు మూడు గంటల సేపు పొలం పనుల్లో పాల్గొనాలనే నియమం పెట్టుకున్నాం. ఇలా చేయడం వల్ల మా శారీరక సామర్థ్యం కూడా మెరుగుపడుతోంది. ప్రకృతితో మమేకమై చేస్తున్న శ్రమ మాకు అదనంగా ఆరోగ్యం అందిస్తోంది. రోజంతా ఉత్సాహంగా ఉంటోంది.''

కేరళలో ఇవాళ ఇది సర్వత్రా కనిపిస్తున్న మార్పు, రోగనిరోధక శక్తి ప్రాధాన్యం ప్రజలకు బాగా తెలిసి వచ్చింది. పోషకాలతో కూడిన ఆహారం, పండ్లు, కూరగాయలపై వారిలో ఆసక్తి విపరీతంగా పెరిగింది. ఇక్కడి భౌగోళిక వాతావరణం కూడా ఇందుకు అనుకూలమైనదే కావడంతో కూరగాయల పెంపకం జోరుగా సాగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ దాదాపు లక్ష ఎకరాల చౌడు భూములను గుర్తించింది. వాటిలో ఆహార పదార్థాలను సాగుచేయాలని సంకల్పించింది. ఇవాళ్టి రోజున చాలా మంది విద్యావంతులు, యువకులు ఈ ఉద్యమా పెరటి తోటల పెంపకం కార్యక్రమంపై చాలా ఆసక్తి చూపిస్తున్నారు. అది మా బాధ్యత అని ముందుకు వస్తున్నారు. ఇది సంతోషించదగ్గ పరిణామం.◆

**Usha S**
Thanal, OD- 3,
Jawahar Nagar, Kowdiar P.O
Thiruvananthapuram - 695003
Kerala.
E-mail: ushathanal@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 22, సంచిక 3, సెప్టెంబర్ 2020

# పర్యావరణ అనుకూల సేద్యం

## పునరుజ్జీవానికి సాధనంగా సాంకేతికత

**ఉషా దేవి వెంకటాచలం**

**డిజిటల్ మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మన చుట్టూ సహజసిద్ధమైన వేదికలు చాలానే ఉన్నాయి. ఇప్పుడు కృషి జనని పేరుతో తమిళనాడు రాష్ట్రంలోని వ్యవసాయదారులకు ప్రత్యామ్నాయ వేదికను అందిస్తోంది. ఇది వికేంద్రీకరణ, పునరుజ్జీవనం సూత్రాలపై ఆధారపడి పనిచేస్తుంది. జనని గ్రో మొబైల్ యాప్ చిన్న, సన్నకారు రైతులకు బాగా ఉపయోగకరం. ఈ యాప్ సాయంతో మార్కెట్ అవకాశాలను పునరుజ్జీవింపచేసుకునేందుకు, సేంద్రీయ మార్కెట్లలో తమ ఉత్పాదనలకు అదనపు విలువలను అందించేందుకు ఉపయోగపడుతుంది..**

తమిళనాడు రాష్ట్రంలోని తిరుప్పూరు జిల్లాలోని కరైపాళ్యం గ్రామంలో అయిదేళ్ల క్రితం వ్యవసాయం ద్వారా లాభార్జనకు తోడ్పడే కృషి జనని పేరుతో ఒక సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకుంది. కృషి జనని ప్రధాన ఆశయం - పునరుజ్జీవన యోగ్యమైన పర్యావరణాన్ని ఏర్పాటుచేయడం, దాని ద్వారా ఇటు రైతులకు, వినియోగదారులకు, పెద్ద సంస్థలకు మాత్రమే కాకుండా ఈ మొత్తం భూగోళానికి మేలు చేకూర్చడం.

తొలి సంవత్సరాలలో దీనిని ప్రయోగాత్మకంగా ఒక నమూనా రూపంలో అమలులోకి తీసుకువచ్చాం. వ్యవసాయ క్షేత్రం ఆధారంగానే సాధ్యమైనన్ని విషయాలను అవగాహన చేసుకోవడం, రైతులలో వాటిపై విశ్వాసం పెంపొందించడం, వారికి ఉపయోగకరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పదును పరచి, వారికి అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టిపెట్టాం. ఈ దశలో రెండు జిల్లాల్లోని రైతుల మధ్య సాన్నిహిత్యాన్ని వృద్ధిచేసేందుకు కేటాయించాం. రైతులు అనుసరిస్తున్న సేద్య విధానాలలో ఉత్తమ పద్ధతులను గుర్తించడం, వాటిని సమన్వయపరచి, వారి అవసరాలకు అనుకూలంగా వాటిని సరిదిద్దడం ముఖ్యమైన అంశంగా పరిగణించాం. కృషి జనని టోకుగా వ్యవసాయదారులకు అవసరమైన ముడి సరుకును కొనుగోలు చేశాం. అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ రకంగా రైతులకు కొంత సొమ్ము ఆదా చేసేందుకు ప్రయత్నించాం. ఈ ప్రయోగ దశలో చాలా కష్టనష్టాలనే ఎదుర్కోవలసి వచ్చింది. కొన్ని విజయాలు కూడా సాధించాం. మరెన్నో అంశాలపై మాకు అవగాహన వచ్చింది. అంటే మేమూ కొన్ని పాఠాలు నేర్చుకున్నాం. ఇది ప్రయోగ దశ కావడం వల్ల వ్యవసాయ రంగంలో సంక్షోభాలను నివారించేందుకు వీలుగా వ్యవసాయ - పర్యావరణను పునరుత్తేజితం చేసే సాంకేతిక రూపు రేఖలు సిద్ధం చేశాం.

ఈ దశలో మా తదుపరి అడుగుల గురించిన ఆలోచనలకు అవసరమైన అంశాలను గుర్తించాం. మొత్తం తమిళనాడు రాష్ట్రం అంతటా సాంకేతికత ఆధారిత మార్గ నిర్దేశం చేయాలనుకున్నాం. దీనికి కేంద్రం జనని పేరుతో ఏర్పాటు చేసిన మార్కెట్ వ్యవస్థ. ఇది లాభదాయకమే కాకుండా పునరుజ్జీవమయ్యే లక్షణం ఉన్నది. ఇది ప్రధానంగా సాంకేతికతకు సంబంధించిన వేదిక. చిన్న, సన్నకారు రైతులకు ఉత్తమ సేద్య పద్ధతులను పరిచయం చేసేందుకు ఉద్దేశించినది. వారి సేద్య విధానాలలో మార్పులను ప్రోత్సహించేది. అదే సమయంలో ఉత్పత్తిదారులకు సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాకు భరోసా ఇచ్చేది. ఒక వైపు కృషి జనని గ్రో యాప్ చిన్న రైతులకు పునరుత్పాదక సేద్య పద్ధతులను అందుబాటులోకి తీసుకువస్తూనే. వారి ఉత్పత్తులకు సేంద్రీయ వస్తు మార్కెట్లను చేరువ చేయడం కాగా, మరో పక్క జనని మార్కెట్ పోర్టల్ ద్వారా రిటైల్ వ్యాపారులను, ముఖ్యంగా ఉత్పత్తిదారులను, ఈ కృషిలో మొదటిసారి అడుగుపెడుతున్న సంస్థలకు మధ్య వారధిగా నిలపడం. అలాంటి వాటిని గుర్తించడం, వారికి అవసరమైన సర్టిఫికెట్లు సమకూర్చడం వంటి కార్యక్రమాలు చేపట్టాం. ఇందుకు వీలుగా జనని మార్కెట్ పోర్టల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వందలాది మంది రైతుల నుంచి సేంద్రీయ ఉత్పత్తులను సేకరించి అందించడం అంతిమ లక్ష్యం.

కొత్తగా ఆవిర్భవించిన ఏ సంస్థకైనా తప్పని విధంగానే మేము కూడా చాలా నెమ్మదిగా రైతులకు ఉపయోగకరమైన సాంకేతికతను సిద్ధంచేస్తూ, మా లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేశాం. ఒక్కోసారి ఒక్కో సాంకేతిక సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టాం. వాటికి అవసరమైన డేటా బ్యాంకు మొత్తం సిద్ధం చేసుకున్నాం. ఆహార పదార్థాలకు సంబంధించిన అన్ని వర్గాలకు అంటే రైతులు, సేంద్రీయ రిటైల్ వ్యాపారులు, పెద్ద సంస్థలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు అనువైన, అవసరమైన సమాచారాన్ని సేకరించి భద్రపరిచాం. ఇక దానిని అవసరమైన వారికి చేరవేయవలసిన సమయం వచ్చింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యవస్థలు అంటే భారీ సమాచారాన్ని లేదా సాధారణ సమాచార సందేశాలను చేరవేసే సేవలు, ఇంకా ఇతర మొబైల్ యాప్ సేవలను ఉపయోగించుకున్నాం. తమిళ భాషలో

సిద్ధం చేసిన యాప్‌ను అగ్రస్థానంలో ముందుంచాం. (ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ ఫోన్ ఆధారితం). దానితోపాటు ఇంగ్లీషు ఆధారిత వెబ్ పోర్టల్‌ను ఉత్పత్తిదారులకు, రిటైలర్లకు అనుకూలంగా తీర్చిదిద్దడం జరిగింది. (ఇది తుది దశలో ఉంది.)

ఇలా సమగ్రంగా వ్యవస్థలు సిద్ధం చేసుకున్న తరువాత మా దృష్టికి వచ్చిన ముఖ్యమైన విషయం ఏమిటంటే అవసరమైన సాంకేతికపరమైన వేదికను సిద్ధం చేయడం తేలికే. సాంకేతికత అనేది అనేక రకాలుగా ఉపయోగించుకునేందుకు ఒక సాధనం మాత్రమే. ఇవి సామాజిక సంక్షేమానికి ఉపయోగపడవచ్చు. లేదా ఇప్పటికే సమాజంలో ఉన్న లోటుపాట్లను మరింత అధ్వాన్న స్థితికి చేర్చే ప్రమాదం కూడా ఉందని గుర్తించాం. ఇటు మంచి అటు చెడు కూడా దానితో పాటే ఎదురవుతాయని తెలుసుకున్నాం. అంటే సామాజికపరంగా, సంస్కృతి పరంగా, ఆర్థికపరంగా అనేక సవాళ్లు ఉంటాయని, వాటి గురించి కూడా ఆలోచించాలని అవగాహన చేసుకున్నాం. సాంకేతికత సేవ చేసేదిగా లేదా తీవ్ర నష్టదాయకంగా మారే అవకాశాలను విస్మరించకూడదు. ఈ సమయంలో తుది రూపం ఇచ్చే ముందు మాకు ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించేందుకు మేము చేసిన ప్రయత్నాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను. ఈ అంశాలు సాంకేతిక ఆధారిత సామాజిక వ్యవస్థ ఏర్పాటుకు ముందుకు వచ్చే ఇతరులకు సహాయపడుతుందని విశ్వసిస్తున్నాను.

## సాంకేతికత మాత్రమే కాదు మరెన్నో అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి

విస్తృతమైన పరిశీలన, సమగ్రమైన ఆలోచనల తరువాత రూపుదిద్దుకునే సాంకేతిక వేదిక రూపకల్పనలో అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకోవడం చాలా ముఖ్యమైన అంశం. మా విషయంలో కూడా, కొన్ని మౌలిక ప్రశ్నలను గుర్తించిన తరువాత సాంకేతికతతో సంబంధంలేని ఇతర అంశాల ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. వ్యవసాయ రంగం విషయంలో ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుకంటే ఏ చిన్న పొరపాటు జరిగినా వేలాది రైతు కుటుంబాలు దారితప్పే ప్రమాదం ఉంటుంది. వారికి ఉపయోగకరం కాని పరికరాలను వినియోగించి తప్పుడు ఫలితాలు పొందవలసి రావచ్చు. ఈ ప్రమాదం దృష్టిలో ఉంచుకుని మాకు మేము వేసుకున్న ప్రశ్నల స్వరూపస్వభావాలు దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి.

## సాంకేతిక యాజమాన్యపు హక్కుదారులు – వ్యవస్థ స్వరూపం

సాంకేతికత, అనుబంధ అంతర్గత కీలక అంశాలపై యాజమాన్యపు హక్కులు ఎవరికి ఉండాలి? ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యమైనా డేటా విషయంలోనూ, పరస్పర సంబంధాల విషయంలోనూ.. అనేది చాలా కీలకమైన అంశం. ఏ సామాజిక వ్యవస్థ కోసం ఇది రూపొందిస్తున్నాం. ఏ స్థాయిలో ఉన్న ఎటువంటి లోటుపాట్లను సరిదిద్దే బాధ్యత తీసుకుంటున్నాం? ఈ యాజమాన్యపు హక్కులు లేదా వ్యవస్థ విషయంలో రైతులకు ఏ మాత్రమైనా అదుపు ఆజ్ఞలు ఉంటాయా?

## సత్ఫలితాలు – దుష్ఫలితాలు

ఈ సాంకేతిక వేదిక కారణంగా ఎదురయ్యే కష్టనష్టాలు ఎవరిని ఎక్కువగా బాధిస్తాయి? ఎవరికి ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి? ఇలా లాభనష్టాల ప్రభావం అందరిపై సమానంగానే ఉంటుందా? అలా కాకుండా కొందరికే ఉపయోగకరంగా ఉంటుందా? అన్న అంశాలను గురించి కూడా ముందుగానే ఆలోచించుకున్నాం.

## ఆర్థిక అంశాలు – ప్రయోజనాలు విభజన

మేము రూపొందిస్తున్న వేదిక ప్రయోజనాలు ఎవరికి చేరుతున్నాయి? ఇది వేదిక ప్రయోజనాల కల్పనలో ప్రతి ఒక్క భాగస్వామికి అందుతున్నదా? అలాగే ఇప్పుడున్న వ్యవస్థను మరింత శక్తివంతం చేయగలుగుతుందా?

## అనూహ్యమైన పరిణామాలు – దారి తప్పిన లోపాలు ఉన్నాయా?

సాంకేతిక అంశాలకు సంబంధించిన వేదిక తయారీ సమయంలో తాము సాధించదలచిన లక్ష్యం గురించిన స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకున్నారు. అందుకోసం హడావిడి పడే సమయంలో అనుకోకుండా మరేవైనా పరిణామాలు ఎదురయ్యే అవకాశాలున్నాయా అని మళ్లీ మళ్లీ పునరాలోచనలు చేశారు. ఎక్కడైనా పరిశీలించినవి కాకుండా మరేవైనా కోణాలున్నాయా వాటిని గమనించలేకపోయామా అని మళ్లీ మళ్లీ పునరాలోచనలు చేశాం. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దడం ఎలా? ఎప్పటికప్పుడు అందుతున్న ఫీడ్ బ్యాక్ ఆధారంగా, నేర్చుకున్న గుణపాఠాల సాయంతో మార్పులు ఎలా చేయాలి? భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడం ఎలా అని ఆలోచించుకున్నాం.

ఇలా రకరకాల ప్రశ్నలు మాకు మేము వేసుకునే సమయంలో మాకు రెండు వేర్వేరు మార్గాలు కనిపించాయి. లాభదాయకమైన వ్యాపార ప్రోత్సాహకంగా సాంకేతికతను అభివృద్ధి చేయాలి లేక పర్యావరణ అనుకూల సేద్యం పునరుజ్జీవనానికి అనుకూలంగా సాంకేతికతను సిద్ధంచేయాలా అనేవి ఆ రెండు మార్గాలు.

## లాభదాయక వ్యాపారంగా

ఈ మార్గంలో మార్కెట్ అవకాశాలు అందించే జనని రూపుదిద్దుకుంది. ఇది విజయం సాధించేందుకు భాగస్తులందరినీ కలుపుకుని ఒక పటిష్ఠమైన వ్యవస్థగా అది పనిచేయాలి. విజయం అంటే ఇప్పటికే ఉన్న ఇతర వేదికలలో - ఆర్థికంగా పురోభివృద్ధికి తోడ్పడాలి. లాభాలు సంపాదించి పెట్టాలి. కంపెనీ

విలువ పెరగాలి. అమెజాన్, ఫేస్‌బుక్, ఉబెర్ వంటివి ఈ మార్గం లో మాకు ఆదర్శంగా కనిపించాయి.

ఈ తరహా వాణిజ్య నమూనాలో వెలికి తీయడం (ఎక్స్‌ట్రాక్షన్) ప్రాథమిక సూత్రం అని చెప్పాలి. సాంకేతిక అంశాలను సిద్ధం చేసాం. తరువాత వాటిని అందుబాటులోకి అందించాం. మళ్లీ మార్పుచేర్పులు చేశాం. కొత్త మార్పులతో అందించాం. ఇందుకు కొన్నేళ్లు పట్టింది. ఈ సాంకేతికతకు సంబంధించిన అన్ని అంశాలను వాటికి సంబంధించిన సాంకేతిక సాఫ్ట్‌వేర్‌తో సహా అందుబాటులో ఉంచాం. స్థానిక అవసరాలకు అనుగుణం గా మార్పులు అవసరం. తొలి దశలో జనని యాప్ తయారీలో మా ప్రయత్నం నానా మార్గాల ద్వారా సేకరించిన అంశాలను క్రోడీకరించి సిద్ధం చేసిన సంకర రూపం కాగా, ఫేస్‌బుక్ వేదిక ఆధారంగా అందుబాటులోకి వచ్చింది. క్రమంగా ''వాటితో పాటు మరికొన్ని'' సూత్ర ప్రాతిపాదికపై మెరుగుపరచడం జరిగింది. అయితే అది కూడా మాకు సంతృప్తి కలిగించలేదు.

ఒక విధంగా చెప్పాలంటే అవి అనేక వేదికల సమాహారం. వాటిలో అనేక మార్కెట్లు ఉంటాయి. సర్వీసు అందించే సంస్థలుంటాయి. వాటిని ఆ సర్వీసు సంస్థలే అందజేస్తాయి.

*యాప్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్*




తమ కస్టమర్ల అవసరాలకు తగిన వారిని సూచించడంలో - అంటే తక్కువ ఖర్చు అయ్యే అమెజాన్ వేదికలు లేదా సదుపాయంగా ఉండే ఉబెర్ వేదికలు, లేదా వాడకంలో సౌలభ్యం ఉండే ఫేస్ బుక్ వంటివి - తమ ద్వారా మాత్రమే ప్రయోజనాలు అందించే మార్గంలో పనిచేస్తాయి. అంతే కానీ నేరుగా కస్టమర్‌కు, అతనికి అవసరమైన సేవలు అందించే సం స్థలతో నేరుగా ఎలాంటి సంబంధాలు ఉండకుండా పెరగకుం డా జాగ్రత్తలు తీసుకుంటాయి. ఈ సమాహార వ్యవస్థలో నష్టాలన్నీ వినియోగదారు పాలు కాగా లాభాలన్నీ పై స్థాయిలో సేవలందించే సంస్థల జేబుల్లోకి వెళ్లిపోతుంటాయి. చాలా సం స్థలు ఈ విషయంలో పోటీ పడుతుంటాయి. ఉదాహరణకు ఉబెర్ కారు డ్రైవర్లను చూడండి. సకాలంలో వాయిదాలు చెల్లిం చలేకపోతే వారి పరిస్థితి ఎలా మారిపోతుందో గమనించాలి. లేదా అమెజాన్‌కు సమాచారం అందించే సమాచార విక్రేతల పరిస్థితి ఆలోచించాలి. పోటీలో నిలబడగలిగే అంశాలకే అది ప్రాధాన్యం ఇస్తుంది. అంటే రివార్డులు, ఆర్థిక ప్రయోజనాలు, అదనపు విలువల ప్రయోజనాలు పై స్థాయికి ఎగబాకుతాయి తప్ప దిగువన ఉన్న వారికి చేరువు. స్థానికులకు ఎలాంటి లబ్ది ఉండదు. భాగస్వామ్య పక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉం డదు. చివరికి ఆ వేదికను రూపొందించిన యజమానులకు కూడా ఏమీ మిగలదు.

ఈ నమూనాలోని వేదికల వల్ల ఎదురవుతున్న అనేక లోపాలు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. వాస్తవ పరిస్థితి కళ్లముందు కనిపిస్తున్నా వాటిని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. లేదా వాటిని సరిచేసే సామర్థ్యం లేక మౌనంగా ఉండిపోతున్నాయి. ఈ సమయంలో ఫేస్‌బుక్‌పై తప్పుడు వార్తల వ్యాప్తి గురించిన ఆరోపణలు గమనించాలి. సమాచార వ్యాప్తిలో ఇది అద్భుత ప్రగతి సాధించింది. ఆ క్రమంలో లక్షలాది డాలర్ల వాణిజ్య ప్రకటనల రూపంలో లబ్ది పొందింది. అయితే అనుకోకుండా ఎదురైన పరిస్థితి ఏమిటంటే దురుద్దేశాలున్న వారి ప్రభావం అందులో పెరిగిపోయింది. ఫలితంగా రాజకీయంగా, సామాజికంగా సం క్షోభాలు ఎదురయ్యాయి. కొన్ని స్వప్రయోజనాలతో వ్యాపిం పజేసిన తప్పుడు సమాచారం కారణంగా ప్రపంచమంతటా దీనిపై అసంతృప్తి రగిలిపోయింది. మొదట్లో వచ్చిన వాణిజ్య ప్రకటనల రూపంలో లాభాలను ఇప్పుడు కాపాడుకునేందుకు ఫేస్‌బుక్ నానా తంటాలు పడుతోంది. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తోంది.

సాంకేతిక పరంగా లేదా ఆర్థికపరంగా ఈ మార్గం లాభసాటిగానే ఉంటుంది. అయితే దీర్ఘకాల ప్రయోజనాల గురించి ఆలోచిస్తే ఇది ఉపయోగకరమైనది కాదని తెలుస్తుంది. వెలికితీత లేదా ఎక్స్‌ట్రాక్షన్ నమూనా ఏ రంగంలో అయినా పారిశ్రామికీకరణ దుష్ప్రభావాలతో అధికార కేంద్రీకరణ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది. వీటి వల్ల ఎదురయ్యే నష్టాలను ఏ విధంగానూ

సరిచేయడం సాధ్యం కాదు. అందువల్లనే జనని యాప్ తయారీ సమయంలో అట్టడుగు స్థాయి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పై స్థాయి వరకు లాభదాయకంగా రూపొందించేం దుకు కృషి చేయాల్సి వచ్చింది.

## పునరుజ్జీవన సాధ్యమైన అగ్రో ఎకాలజీ లక్ష్యంగా

తమిళనాడులోని వ్యవసాయ రంగం ఇప్పటికే లోతుగా ఇంకా లోతుగా బోరు బావులు తవ్వుతూ వెలికితీత సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటోంది. నిస్సారంగా మారిపోయిన భూముల నుంచి ఇంకా ఇంకా అధిక దిగుబడుల కోసం ప్రయాసపడుతోంది. అందుకు పర్యావరణ స్థితిగతులు చేయి దాటిపోవడమే ప్రధాన కారణం. వాతావరణ అనిశ్చితి తరచుగా ఎదురవుతున్న సమస్య. దాని తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటోంది. ఇలాంటి పరిస్థితులలో పర్యావరణ అనుకూల సేద్యం సవ్యంగా సాగేందుకు తక్కువ ఖర్చుతో, కొద్దిపాటి సాంకేతిక సంక్లిష్టతలతో దీర్ఘకాలిక పరిష్కారాలు చూపించేందుకు అనువైన ప్రత్యామ్నాయమే ఇది. పునరుజ్జీవన సాధ్యతే లక్ష్యంగా పర్యావరణ సేద్యాన్ని (రీజనరేటివ్ అగ్రో ఎకాలజీ) ప్రోత్సహించడమే అందుకు అన్ని నగరాలలోనూ రైతు వర్గం ఎదుర్కొంటున్న సమస్యలకు సరైన పరిష్కారం.

రీజనరేటివ్ అగ్రో ఎకాలజీ అనేది ఎక్స్‌ట్రాక్టివ్ వ్యాపార విధానానికి ప్రత్యామ్నాయం అనుకుంటే మరి సాంకేతికపరం గా ప్రత్యామ్నాయం ఏమిటి? అనే ప్రశ్న ఎదురవుతుంది. ఎక్స్‌ట్రాక్టివ్ వ్యాపార సూత్రాలతోనే రూపొందిన సాంకేతికత తన లక్షణాలను మార్చుకుని రైతులకు ఉపయోగకరమైన రీజనరేటివ్ అగ్రో ఎకాలజీ అభివృద్ధికి సహకారం అందిస్తుందా? మరిన్ని ప్రయోజనాలు కల్పించే సాంకేతికపరమైన వేదికలో మార్కెట్ అవకాశాలు కూడా కలిసి ఉండి రీజనరేషన్ ప్రక్రియ అంతర్భాగం గా ఉండేలా సిద్ధం చేయడం సాధ్యమేనా? జనని మార్కెట్ వేదిక రూపకల్పన సమయంలో ఈ ప్రశ్నలన్నీ ఎదురయ్యాయి. అయితే వాటిలో కొన్నింటికి మాకు ఇంకా సరైన సమాధానాలు దొరకలేదనే చెప్పాలి. మరికొన్నింటిని వ్యవసాయభూములలో ప్రయోగించాల్సి ఉంది. ఆ తరువాతే మా ఆలోచనల్లోని లోపాలు తెలుస్తాయి. జనని మార్కెట్ వేదికలో ఈ దిశగా మా ప్రయత్నాలు సాగుతున్న తీరు తెన్నులు ఎలా సాగుతున్నాయి? అంటే.

## యాజమాన్యపు హక్కులు – వ్యవస్థ స్వరూపం

జనని మార్కెట్ వేదిక ఆధారంగా రైతులు తమకు అవసరమైన, అమూల్యమైన సమాచారాన్ని భద్రపరచుకునే అవకాశం ఉం టుంది. అంతేకాకుండా రైతు సంఘాల మధ్య అనుబంధాలు సజావుగా సాగేందుకు ఇది తోడ్పడుతుంది. రైతులకు కీలకమైన సమాచారం భద్రపరిచే అంశంపై ఇటీవలే దృష్టిపెట్టాము. అయితే రైతుల మధ్య పరస్పర సంబంధ బాంధవ్యాలు చాలా కీలకమైనవి. ఎందుకంటే ఈ సంబంధాలపై ఆధారపడి మాత్రమే ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు మధ్య సరైన ఇచ్చిపుచ్చుకునే సదుపాయం ఉండే వ్యవస్థ స్థిరపడుతుంది. ఒక రకంగా జనని వేదిక అనేక నెట్‌వర్క్‌గా ఉపయోగపడుతుంది. అంటే ఒక నెట్‌వర్క్ విజయం మిగిలిన వాటి విజయానికి సహకరిస్తుంది. ఇలా ఉపయోగపడేందుకు అవసరమైన సాం కేతికత నమూనా అనేక సవాళ్లతో కూడిన వ్యవహారం అని చెప్పక తప్పదు. దీనిని రైతులకు చేరువ చేయాలంటే మౌళికంగా కొన్ని సామర్థ్యాలను ఇందులో పొందుపరచాల్సి ఉంటుంది. ముఖ్యం గా డేటా, ఫైల్స్‌ను నిల్వచేయడం, వాటిని సరైన సమయానికి అందించేందుకు వీలుగా కమ్యూనికేషన్ వ్యవస్థ, చెల్లింపుల వ్యవహారాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోనే ఉంచాలి. అందులో భాగంగా రైతులందరికీ భాగస్వామ్యంతో పాటు యాజమాన్య హక్కు కూడా ఉండాలి. అప్పుడే అది యజమానులకు, వినియోగదారుకు ప్రయోజనకరంగా ఉంటుంది.

## సత్ఫలితాలు – దుష్ఫలితాలు

వ్యవసాయదారులు ఇప్పటికే సేద్యం చేసే పనుల్లో నిలకడలేని సవాళ్ల మధ్య భరోసా లేని ఫలితాల కోసం పోరాడుతున్నారు. అలాంటి పేద రైతులు ఉమ్మడి వేదిక ఏర్పాటుకు ముందుకు వచ్చి మరో సమస్యను తలకెత్తుకునేందుకు సిద్ధంగా లేరు. అందువల్ల అలాంటి సాహసానికి సిద్ధపడి ముందుకు వచ్చే పెట్టుబడిదారులను గుర్తించడమే పెద్ద సవాలు.

## ఆర్థిక అంశాలు – ప్రయోజనాలు విభజన

సాంకేతికపరమైన వేదిక నిర్మాణం ఆర్థిక ప్రయోజనాలు, ఇతరత్రా ఉపయోగాలు ప్రతి ఒక్కరికీ చేరేందుకు అనువుగా ఉండాలి. ఇది చాలా క్లిష్టమైన అంశం. వివిధ ప్రాసెస్‌ల రూపు రేఖలు, వాటి ప్రయోజనాల ప్రవాహం అట్టడుగు వర్గాల వరకు చేరేలా తయారయ్యాయి. జనని ఈ విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను కూడా గుర్తించింది. ఉదాహరణకు సేంద్రీయ ఉత్పాదనగా నిర్ధారించేందుకు పీజీఎస్ ఇండియా సంస్థను అనుసంధానం చేసాం. ఇది స్థానికంగా రూపుదిద్దుకున్న పరిజ్ఞానానికి, పర్యవేక్షణకు కేంద్రంగా వ్యవహరిస్తుంది. రైతులు తమ అనుభవాలను నేరుగా ఇందులోకి నమోదు చేసుకోవచ్చు. ఆ తరువాత దానిని అవసరమైన వారు తెలుసుకుని ఆచరణలోకి పెట్టుకోవచ్చు. దీనికి ఈ సర్టిఫికేషన్ సంస్థ ధృవీకరణలు ఆధారం గా కొనుగోలుదారులు, విక్రేతలు, రైతులు కూడా అవసరమైన విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

అనూహ్యమైన పరిణామాలు - దారి తప్పిన లోపాలు ఉన్నాయా?

ఇందుకోసం జనని మార్కెట్ ప్లేస్ వేదిక ప్రత్యేకమైన సాం కేతిక అభివృద్ధిపై దృష్టి పెట్టింది. సాఫ్ట్‌వేర్ రూపకల్పన,

వాటి వాడుకకు తేలికైన విధానాలు అనుసరించింది. గత అనుభవాలను ప్రాతిపదికగా చేసుకుని కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. అందుకు అవసరమైన సలహాసూచనలను స్వీకరించేందుకు క్రమపద్ధతిలో ప్రయత్నించింది. లోటుపాట్లు గుర్తించి సరిదిద్దేందుకు కృషిచేసింది. అందుకు తగినట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పుచేర్పులు చేసింది. ఇదే విధానాన్ని క్షేత్ర స్థాయి అవసరాలకు విస్తరించింది. ఆ రకంగా క్షేత్రస్థాయిలో కూడా గుణపాఠాలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అంటే సాంకేతికత పొలాల్లో అనుసరించడం, ఆ క్రమంలో లోపాలు గుర్తించడం సాధ్యమవుతుంది.

ప్రస్తుతం మన ఆహార పదార్థాలకు సంబంధించిన వ్యవస్థలన్నీ పారిశ్రామికీకరణ ప్రభావంలోనే పనిచేస్తున్నాయి. అన్ని కార్యకలాపాలు కేంద్రీకృత స్థాయిలోనే జరుగుతుంటాయి. అయితే ఆహారం ఎక్కడో ఉత్పత్తి అవుతుంది. ప్రాసెస్ చేయడం కోసం దానిని మైళ్ళ దూరం తరలించవలసి ఉంటుంది. అక్కడి నుంచి మార్కెట్‌కు చేరేందుకు మరెన్నో మైళ్ళ దూరం తరలించాల్సి ఉంటుంది. వినియోగదారులను చేరడానికి అనేక మైళ్ళ దూరం సరఫరా కావలసి ఉంటుంది. కోవిడ్ 19 ప్రభావిత అంశాలు బలహీనమైన ఈ ప్రక్రియకు పెద్ద సవాళ్లు విసురుతున్నాయి.

ప్రత్యామ్నాయంగా వికేంద్రీకరణ దిశగా పునరుత్పాదనకు అనువుగా ఈ ప్రక్రియలు రూపాంతరం చెందడం అవసరం. జనని మార్కెట్ ప్లేస్ వేదిక ఈ దిశగానే అడుగులు వేస్తోంది. ప్రస్తుత సమాజం ఇలాంటి పునరుజ్జీవన ప్రక్రియల కోసమే ఎదురుచూస్తోంది. ఆహార సరఫరా వ్యవస్థ విభిన్న రూపాలలో శక్తివంతం కావాలి. ఇది నేటి తక్షణ ఆవశ్యకత. ◆

**Usha Devi Venkatachalam**
Founder and CEO
Krishi Janani PBC
E-mail: team@krishijanani.org

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 22, సంచిక 2, జూన్ 2020

**LEISA INDIA Language Editions**



**Kannada, Telugu, Tamil, Oriya, Hindi, Marathi, Punjabi**

# ఇది మా తోట - అది మా జీవితం

**సురేశ్ కణ్ణా**


''మీకు కావలసిన ఆహారాన్ని మీరే పండించుకోండి'' అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న ఆధునిక ధృక్కోణం. ఈ ఆలోచన పట్టణాలలోనూ, నగరాలలోనూ విస్తరిస్తోంది. పట్టణీకరణ ప్రభావం వల్ల చెత్త పేరుకుపోవడం ఫలితంగా కాలుష్యం ప్రబలడం సర్వసాధారణ నగర జీవితంగా మారిపోయింది. దీనికి తోడుగా పెరిగిపోతున్న పేదరికం వల్ల ఇంధనం, తాగునీరు పెను సమస్యలుగా మారిపోయాయి. ఇలాంటి పరిస్థితులలో అవకాశం ఉంటే ఇంటి పెరటి స్థలాలలోనూ, లేదా మిద్దె మేడలపైనా వంట ఇంటి అవసరాలను తీర్చే చిన్న చిన్న తోటల పెంపకం కొంతవరకు సమస్యలకు పరిష్కారంగా నిలుస్తోంది. ప్రజల జీవన శైలిలో కూడా మార్పు అవసరం. పెరటి తోటల పెంపకానికి అవసరమైన కంపోస్టు తయారీ సామర్థ్యాన్ని పౌరులు పెంపొందించుకోవాలి.

ఇలా పెరటి తోటల పెంపకం చాలా ఉపయోగాలు అందజేస్తుంది. సురక్షితమైన, పోషక సమృద్ధమైన, తాజా ఆహారం అందుతుంది. వ్యర్థ పదార్థాలు సద్వినియోగం అవుతాయి. పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుంది. అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. అదనపు ఆదాయం తెచ్చిపెడుతుంది. పౌరులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతారు. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కర్బన కాలుష్యం అదుపులోకి వస్తుంది.

## పెరటి తోట పెంపకం – నా అనుభవం

తిరుచ్చి పట్టణంలో నేను 2000వ సంవత్సరం నుంచి నివసిస్తున్నాను. ప్రారంభంలో నగరం మధ్యన ఇంట్లో అద్దెకు ఉండేవాళ్లం. అక్కడ పెరడు అనేది కానీ, మొక్కల పెంపకానికి ఏ మాత్రం అవకాశం లేదు. అయితే ఇంటిపై కప్పు (బాల్కనీ) లో కొన్ని రకాలైన ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచేవాళ్లం. అందుకు ఖాళీ సీసాలను ఇంకా ఇతర సాధనాలు ఉపయోగించేవాళ్లం. అయితే ఏడాది క్రితం శివారులో సొంతంగా కట్టుకున్న సొంత ఇంటికి మారాం. అక్కడ 800 చదరపు అడుగుల స్థలంలో ఇంటిని నిర్మించి, సుమారు 1600 చదరపు అడుగుల స్థలాన్ని మొక్కల పెంపకానికి వీలుగా వదిలిపెట్టాం.

విద్యాపరంగా మొక్కల శాస్త్రం చదివిన కారణంగా కొంత, తిరుచ్చిలోనే ఉండే స్వచ్ఛంద సంస్థ కుదుంబం అనే సంస్థతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా తోటల పెంపకంపై ఆసక్తి పెరిగింది. కుదుంబం సంస్థతో నాకు 1995 నుంచి అనుబంధం ఉంది. ఇది తమిళనాడులో చురుగ్గా పనిచేస్తుండేది. అందువల్ల సుస్థిర



*తన సొంత క్షేత్రంలో పండించిన గుమ్మడి కాయలను చూపిస్తున్న సురేశ్*

వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన ఏర్పడింది. ఇంటి చుట్టూ ప్రహరీ సిద్ధం చేసి, పెరటి తోటల పెంపకం చేపట్టాం.

మా కుటుంబంలో మొత్తం నలుగురం ఉంటాం. భార్య పేరు గజ, కుమార్తె శృతి, కుమారుడు హరీశ్.. సరే నేను. ఈ కార్యక్రమంలో అందరం కలిసి పాలుపంచుకునేవాళ్ళం. మేం అనుసరించిన విధానం చాలా సాధారణమైనది. వంటింటి ఉపయోగానికి ఎంత అవసరం అనే విషయాన్ని పరిశీలించాం. అలాగే వంటింటికి కాకుండా ఇతరత్రా ఎలాంటి అవసరాలు ఉంటాయనే అంశం గురించి నిర్ధారించుకున్నాం. మొక్కల పెంపకానికి సాధ్యమైనంత తక్కువ మొత్తం ఖర్చు అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నాం. మా వనరులకు తగినట్లుగా మూడు ''ఆర్'' నిబంధనల సూత్రీకరణను అనుసరించాం. అంటే రెఫ్యూజ్ (నిరాకరించడం), రీసైకిల్ (పునర్వినియోగించడం), రీ యూజ్ (మళ్లీ మళ్లీ ఉపయోగించడం) అనేవే మేము పాటించిన మూడు మూల సూత్రాలు.

## వంటింటి అవసరాలకు మొక్కలు

వంటింటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని - కొడి పసలై (బచ్చలి ఆకు - బసిల్లా అల్బా), బొమ్మనంగన్ని (పొన్నగంటి కూర - అల్టర్నెంతెర సెసిలిస్), కుతుపసలై (బచ్చలి - బసీలా రుబ్రా), పులిచకీరల్ (గోంగూర లేక పిండి కూర - హిబిస్కస్ కానోబినస్), వెదియ కీరై (మెంతి కూర - ఫెనుగ్రీక్), మురంగకీరై (ములగ కాడలు లేక ములగాకు - డ్రమ్ స్టిక్ లీవ్స్) మొదలైన మొక్కల పెంపకం చేపట్టాం. ఈ ఆకుకూరలను ఉదయం అల్పాహారంలో లేదా ప్రధాన భోజనంలో భాగంగా ఉపయోగిస్తాం. సాధారణంగా రాత్రి వేళ ఆహారంలో ఆకు కూరలను ఉపయోగించేదిలేదు.

కొత్తిమీర లేక కరివేపాకు వంటి వాటిని కూడా పెంచుతూ వచ్చాం. కూరగాయలలో టమేటా, బెండకాయ, వంకాయ, ఉస్తికాయ, చిక్కుడుకాయ, ములగకాడ, కాకరకాయ, బీరకాయ, ఆనపకాయ వంటివాటి పెంపకం కూడా చేపట్టాం.

## ఔషధ మొక్కలు

ఔషధ లక్షణాలు ఉండే కృష్ణ తులసి, అలోవెరా, వాసకం (జస్టికా అధతోడ), గరిక అనే గడ్డి (అరుగంపుల్), తిరునేత్రు పచ్చిలై, పిరాండై, తమలపాకులు (బీటల్‌వైన్), నిమ్మగడ్డి (లెమన్‌గ్రాస్), రనకల్లి, కీలనెల్లి, నాయికడుగు, కర్రీ లీఫ్, ఇన్సులిన్ ప్లాంట్, మరుతని, కుప్పయ్మెని (కుప్పింటాకు) మొదలైన వాటిని కూడా పెంచగలిగాము. దీనిని మా ఔషధ శాలగా వ్యవహరిస్తాం. సాధారణమైన ఆరోగ్య సమస్యలకు ఇవి చాలా ఉపయోగకరం. ముఖ్యంగా జలుబు, దగ్గు, ముక్కు కారడం, జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, మలబద్ధకం వంటి సమస్యలకు ఇవి సరైన పరిహారాలు, శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచడంలోను, రక్తపోటు, చక్కెరస్థాయి నియంత్రణలోను ఉపయోగిస్తాం. వీటిని ముడి ఆకుల రూపంలో కానీ, కషాయం రూపంలో కానీ, సూపు రూపంలో కానీ, సాంబారు లేదా చట్నీలో ఉపయోగించవచ్చు.

## పూజలు, వగైరా అవసరాలకు

మా ఇంటి తోటలో పూజలు, పునస్కారాలలో ఉపయోగపడే మొక్కలు కూడా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి - జాస్మిన్ (మల్లె పూవు), మందార, అంతిమంతరై, పిచ్చిపూవు, కాగితం పూవు, అరలిప్పూవు. మల్లె పూవులు మా ఇంటి ఇల్లాలికి, మా అమ్మాయికి ఇష్టం. మిగిలినవి పూజల సమయంలో వినియోగిస్తాం. ప్రతి ఉదయాన పూవులను సేకరించి, పాత వాటిని తొలగించి తాజా పూవులను అలంకరిస్తాం. మందార ఆకులు రక్తశుద్ధికి తోడ్పడతాయి. అందువల్ల పూజలో వాడిన మందార ఆకులను మరుసటిరోజు తీసి మందార ఆకులను మేము ప్రసాదంగా తీసుకుంటాము.

## ఇక చెట్ల రూపంలో

మేము కొన్ని చెట్లను కూడా పెంచడం ప్రారంభించాం. వాటి వల్ల చాలా ప్రయోజనాలే ఉన్నాయి.  మామిడి, బొప్పాయి, జీడి మామిడి, జాక్‌ఫ్రూట్, జామ, కొడుక్కపులి, అరటి, నిమ్మ (అమ్లు), గూస్ బెర్రీ చెట్లు ఉన్నాయి. ఇంకా వెదురు రూపంలో విలువైన టేకు, సేమమ్మరం, కాజురీనా, వేప, పూవరుసు వంటివి పెరుగుతున్నాయి. పండ్ల చెట్లు రెండేళ్లలో ఫలాలను ఇస్తాయి. ఇక కలప అవసరాలకు ఉపయోగపడే చెట్లు దీర్ఘకాలంలో మా కుటుంబానికి అక్కరకు వస్తాయి.

## చిన్న చిన్న అంశాలు – చెప్పుకోదగ్గ ఫలితాలు

మా పెరటి తోటలో పక్షులు తాగడం కోసం మంచి నీటి సదుపాయం ఏర్పాటుచేశాం. అవి వచ్చి నీళ్లు తాగుతున్నప్పుడు కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. పైగా వాటి కారణంగా తోటలోని మొక్కలకు చీడ పురుగుల బెడదను అవి నివారిస్తున్నాయి. ఆ పురుగులను ఆ పక్షులు తినివేస్తాయి. అయితే మేము చీడ పురుగులను నాశనం చేయాలని అనుకోలేదు. ఎందుకంటే మనుషులే కాదు. అన్ని జీవాలు బతకాలి కదా. నెమళ్లు, మైనా పక్షులు, చిట్టుకురివి వంటి పక్షులు నిత్యం మా తోటకు వచ్చే అతిథులు అని చెప్పాలి. చిట్టుకురువి పక్షులు పిల్లలను పెట్టడానికి వీలుగా తోటలో పక్షి గూళ్లను కూడా ఏర్పాటుచేశాం. తోటలో ఎక్కడ మట్టి తవ్వినా అందులో పెద్ద సంఖ్యలో వానపాములు కనిపిస్తాయి. ఇది భూసారం సురక్షితం అని చెప్పకనే చెపుతుంది.

ప్రకృతికి చేరువగా ఉండడమే మా ఆనందమయ జీవిత రహస్యం అని చెప్పాలి. ప్రతీ రోజు ప్రకృతి నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకుంటున్నాం కూడా. మాకు లభిస్తున్న వాటిని రీసైక్లింగ్ చేసే అవకాశాలు కావల్సినన్ని ఉన్నాయి. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు,పువ్వులుమావంటిగదినిసుసంపన్నంచేస్తుంటాయి. అలాగే కిచెన్‌లో పేరుకున్న వ్యర్థాలు మళ్లీ ఎరువుల రూపంలో లేదా కంపోస్టు రూపంలో తోటకు చేరతాయి. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే మాకు అవసరమైన విత్తనాలను మేమే నిల్వ చేసుకుంటున్నాము. మా నిల్వల్లో కూరగాయలు, పప్పుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఆకుకూరలు, పూల విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయి. మా జీవితం గురించి చెప్పాలంటే - అది పర్యావరణంతో ముడిపడి పునరుత్పత్తి లక్షణాలతో విలసిల్లుతున్నది. మా తోటకు మరింత సమగ్రమైన రూపం తీసుకు వచ్చేందుకుచికెన్,ఫిష్,గొర్రెలనుకూడాచేర్చాలనిఆలోచిస్తున్నాం. మేము పండించిన తోట ఉత్పాదనలను ఇరుగుపొరుగు వారితో, చివరికి పారిశుధ్య పనివారితో కూడా కలిసి పంచుకుంటాము. అందరికీ ఉచితంగానే అందిస్తున్నాము. అందువల్ల మా అనుబంధాలు మరింత పటిష్టంగా నిలిచి ఉంటున్నాయి. ఇప్పుడు వారిలో కొందరు తాము కూడా స్వయంగా తోట పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇది మా పెరటి తోటలో మా ప్రశాంత జీవితం.

◆

**Suresh Kanna**
Kudumbam,
No. 113/118, Sundaraj Nagar,
Subramaniyapuram,
Trichy - 620 020, Tamil Nadu, India
E-mail: sureshkanna_kudumbam@yahoo.in

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 22, సంచిక 3, సెప్టెంబర్ 2020

# నగరాల్లో సేద్య కార్యకలాపాలకు ప్రోత్సాహం

దెబోరా దత్త

**పరిశ్రమ రూపంలో సాగుతున్న వ్యవసాయ కార్యకలాపాల ప్రభావంతో భూసారం దిగజారిపోతున్న వాస్తవాన్ని గుర్తించి ఆహార పదార్థాల ఉత్పాదన, వినియోగం వంటి అంశాలపై నగరాలలోనే కేంద్రీకృతమై ఉండే మేధావులు తమ ఆలోచనల్లో మార్పులు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పరిస్థితి భూసార క్షీణతతో పాటు వాతావరణ అనిశ్చితి ఆహార భద్రత సాధనకు పెను సమస్యలుగా నిలుస్తున్నాయి. సామాజిక వ్యవస్థల రూపంలో పట్టణ ప్రాంతాల్లో సేద్య రంగానికి అవకాశాలు కల్పించడం చాలా అవసరం. ఇలా చేయడం ద్వారా భూమి, భూమిని దున్ని పంట పండించే రైతన్న, పర్యావరణ ప్రభావాల విషయంలో సహానుభూతి, లోతైన అవగాహన, సన్నిహిత అనుబంధాలు మెరుగుపడతాయి.**

ప్రపంచం మొత్తం మీద ఉన్న జనాభాలో సగానికి సగం పట్టణాల్లోనే నివసిస్తున్నారు. గత శతాబ్దంలో పర్యావరణం కలుషితం కావడానికి ఇదే అతి పెద్ద కారణం. ఆహార భద్రత లేకపోవడం, వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం (గ్లోబల్ వార్మింగ్), వాయు కాలుష్యం పెరిగిపోవడం, పరిమిత నీటి వనరులను అతిగా ఉపయోగించుకోవడం, అడవుల నరికివేత కారణంగా తరగిపోతున్న వృక్ష సంపద, ఇంకా మరెన్నో సమస్యలకు పట్టణాలలో కేంద్రీకృతమవుతున్న వలస ప్రజలు కారణమవుతున్నారు.

## సమష్టి కృషికి నిదర్శనం – పట్టణ సేద్యం

ఆహార భద్రత సమకూర్చడం, ఉత్పత్తి విధానం పట్టణీకరణతో నేరుగా ముడిపడి ఉంటాయి. పర్యావరణపరమైన సమస్యలు కూడా వాటితో ముడిపడి ఉంటాయి. అయితే వాటి మధ్య ఏర్పడిన చిక్కుముడులు అంత సులభంగా అర్థంకావు. పట్టణవాసులు సహజంగానే వ్యవసాయం జరిగే పల్లెసీమలకు దూరంగా ఉంటారు. వారికి అక్కడి పరిస్థితులు ఏ మాత్రం అనుభవంలోకి వచ్చి ఉండవు. నగర జీవులకు అవసరమైన ఆహారం పండిన చోటు నుంచి కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించి వారి దగ్గరికి చేరుతూ ఉంటాయి. ఈ క్రమంలో ఆ ఆహార పదార్థాలు అనేక చేతులు మారుతూ ఉంటుంది. ఫలితంగా వాటి ఖరీదు పెరిగిపోతూనే ఉంటుంది. అంతేకాదు, ఈ ఆహార పదార్థాల రవాణా క్రమంలో వాతావరణంపై కూడా ప్రభావం పడుతూ ఉంటుంది. ఈ రకమైన ఆహార సేకరణ విధానం వినియోగదారులనే కాకుండా పంట పండించిన రైతుల దోపిడీకి కూడా ప్రాతిపదిక అవుతోంది.

ఇటీవలి సంవత్సరాలలో సమాజంలో ఒక విచిత్రమైన మార్పు కొట్టవచ్చినట్లుగా కనిపిస్తోంది. పెద్ద పెద్ద కంపెనీలలో పెద్ద పెద్ద జీతాలకు పనిచేస్తున్న అనేక మంది తమ ఉద్యోగాలను వదిలిపెట్టి వ్యవసాయ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఈ మార్పునకు చాలా కారణాలే ఉన్నాయి. ప్రధానమైన అంశాలు సురక్షితమైన ఆహారం విలువ, అదుపు తప్పుతున్న పర్యావరణ దుష్ప్రభావాలను అడ్డుకోవడం కోసమే ఇలా సేద్యంపై ఆసక్తి పెరుగుతోంది. ఇది పర్యావరణాన్ని సురక్షితంగా మార్చే సేద్య విధానాలను గుర్తించే దిశగా సాగుతోంది. ఇప్పటివరకు సంప్రదాయక సేద్య విధానాలనే అనుసరిస్తున్న వ్యవసాయంలో మార్పుల కోసం ముందుకొస్తున్న పట్టణ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల నిర్వాహకుల గురించి వివరించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

## డ్రీమ్ గ్రోవ్ (డీజీ-కలల తోట) – సామాజిక స్ఫూర్తితో సాగుతున్న వ్యవసాయ క్షేత్రం

డ్రీమ్ గ్రోవ్ అన్న పేరుతో కొంత మంది ఔత్సాహికులు కలిసి ముంబయిలోని పబ్లిక్ పార్కులోని 800 చదరపు అడుగుల స్థలంలో కలల తోట పెంపకం చేపట్టారు. ఈ పార్కు అంతవరకు నిర్లక్ష్యానికి గురయి శిథిలావస్థలో ఉంటుండేది. ఈ పార్కు పరిస్థితిని చూసిన స్థానిక మహిళ మేరీ పాల్ దీనిని అందమైన తోటగా రూపొందించాలని ఆలోచన చేశారు. చిన్నారులకు, పెద్దలకు కూడా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలనుకున్నారు. ఇది 2018 నాటి మాట. ఆలోచనను ఆచరణలోకి తెచ్చేందుకు ఇరుగుపొరుగు వారితో కలిసి ఒక గ్రూపును ఏర్పాటుచేసారు. వారిలో ఇద్దరు ప్రమీల మార్టిన్, దీప్తి ఝుంగియాని (బాక్సు చూడండి) తోటల పెంపకంలో పూర్వ అనుభవం ఉన్నవారు. అప్పటికే వారిద్దరు అర్బన్ లీవ్స్ పేరిట ఉన్న ఔత్సాహిక సేద్య బృందంలో స్వచ్ఛంద కార్యకర్తలుగా పనిచేసినవారు.

మార్టిన్ ముందుగా చొరవ తీసుకుని నేల రాలిన ఆకులు అలములు, ఇంకా ఇతర వ్యర్థ పదార్థాలను, వంటింటి వ్యర్థాలను, కొబ్బరి పీచువంటి చెత్తను పరిసరాల నుంచి సేకరించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వాటిని కంపోస్టుగా తయారుచేశారు. పార్కు ఆవరణలోనే ఆవు పేడ, మూత్రం కలిపి కంపోస్టు తయారీ ప్రారంభించారు. (ఈ రకంగా తయారుచేసిన కంపోస్టును అమృత మట్టి అని వ్యవహరిస్తారు). పోషకాలతో సమృద్ధమైన ఈ రకంగా సిద్ధంచేసిన సేంద్రీయ పద్ధతులలో పండ్లు, కూరగాయలు

## వాలంటీర్ల వివరాలు

ప్రమీలా మార్టిన్ ఆర్థిక రంగంలో డిగ్రీ స్థాయి విద్యావంతురాలు. చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి ఆమె స్వచ్ఛందంగా 2013లో ఈ తోటల పెంపకం గ్రూపు (అర్బన్ లీవ్స్)లో సభ్యత్వం తీసుకున్నారు. అర్బన్ లీవ్స్ సంస్థ నిర్వహించిన తోటల పెంపకం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దీప్తి ఝుంగియాని పత్రికా రంగంలో విద్యావంతురాలు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంపై ఆమెకు ఆసక్తి ఎక్కువ. ఆమె తన ఇంటిలోనే కంపోస్టు తయారీ చేస్తూ వచ్చేది. ఆ తరువాత ఆమె కూడా అర్బన్ లీవ్స్ బృందంలో చేరారు.

పండించడం మొదలుపెట్టారు. తొలినాళ్లలో ఈ ఆలోచనకు బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) వర్గాలు అంతగా ఆసక్తి చూపించలేదు. కాని స్థానికులనుంచి వచ్చిన స్పందన, వచ్చిన ఫలితాలను గమనించిన తరువాత పార్క్ నిర్వహణ భారం తీసుకునేందుకు బిఎంసి ముందుకువచ్చింది. ఇప్పుడు పార్క్ బాధ్యతలను అదే నిర్వహిస్తోంది. మరిన్ని ఇటువంటి సామాజిక ఆధారిత ఆహార పదార్థాల తోటల పెంపకానికి సిద్ధమవుతోంది.

గడచిన రెండు సంవత్సరాల కాలంలో 50 రకాల మొక్కల పెంపకం చేపట్టినట్లు ఝుంగియాని తెలియచేశారు. వాటిలో పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు ఉన్నాయి. సీజన్‌లకు తగినట్లుగా అనాస పండ్లు, అరటిపండ్లు, చిలగడ దుంప (యామ్), ముల్లంగి (రేడిష్), టమేటా, కాకర కాయలు, మిరపకాయలు, ఓక్రాలు కూడా పండిస్తున్నారు. ప్రత్యేకంగా ఆమె వెల్లడించిన ముఖ్య విషయం ఏమిటంటే పరిసరాలలోని వ్యక్తులు తమకు తాముగా ముందుకు వచ్చారు. శ్రమదానం చేసి కంపోస్టు తయారీ, నేల దున్నడం, మొక్కల సంరక్షణ వంటి విషయాలలో స్వయంగా పాల్గొని సహకరించారు అని తెలిపింది. ఈ విధంగా కలిసికట్టుగా అవసరమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసుకోగలిగినట్లు ఆమె తెలిపారు. ఏడేండ్ల నుంచి 80 ఏండ్ల వరకు ఉన్న అన్ని వయసుల వారు చేయూత ఇచ్చిన కారణంగా సమష్టి కృషి, సమన్వయం, సంప్రదింపులు సజావుగా సాగడానికి సాధ్యమైందని వివరించారు. వారాంతపు రోజులలో సగటున 20 మంది సభ్యులు విత్తనాలు నాటడంలోను, మొక్కలు నాటడంలోనూ, పంటకోత సమయంలోనూ, నీరు పెట్టడం వంటి పనుల్లో పాలు పంచుకునేవారు. ఆమె మాటల్లోనే. ''వ్యక్తి తనకు తానుగా ఇలాంటి కార్యక్రమాలలో పాలుపంచుకున్నప్పుడు సాధించే ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. మేము కేవలం మొక్కలను పెంచడం లేదు. ఆ క్రమంలో మానవులుగా సంఘజీవులుగా మేమంతా ఎదుగుతున్నాం.''

> కమ్యూనిటీ పరంగా సాధించిన అనుభవాలపై పట్టణ వినియోగదారుల్లో సరైన చైతన్యవంతులను చేయడం వల్ల మాత్రమే సుస్థిర వ్యవసాయానికి, అలా ఉత్పత్తి చేసిన ఉత్పాదనలకు అవసరమైన సహాయం అందించడం సాధ్యమవుతుంది. వారికి అవసరమైన సహకారం అందించడం సాధ్యమవుతుంది

ప్రస్తుతం ఈ గ్రూపు కార్యకలాపాలను మరింత విస్తరించి సమీపంలో ఉన్న వారాంతపు రైతు మార్కెట్‌తో సంధానం సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. వారి నుంచి సేంద్రీయ విత్తనాలను సమకూర్చుకోవడం అత్యంత ముఖ్యమైన అవసరం. కాగా మార్కెట్ మూసివేసిన తరువాత అక్కడ పేరుకుపోయే చెత్త, వ్యర్థాలను కూడా సేకరించి కంపోస్టు తయారీలో ఉపయోగించుకోవాలనేది వారి ఆలోచన. ఆహార పదార్థాల గొలుసుకట్టు ప్రాధాన్యతపై వారిలో పెరుగుతున్న ఆసక్తి గమనించిన ప్రమీల గ్రోవర్స్ టు బాంద్రా హోమ్స్ పేరుతో ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారుల ఇండ్లకు సరఫరా ఏర్పాటుపై దృష్టి పెట్టారు. ఈ ఆలోచన ఇటీవలి లాక్ డౌన్ సమయంలో జోరుగా ఆచరణ రూపం దాల్చింది. రైతుల లేదా రైతు సంఘాల నుంచి నేరుగా ఉత్పత్తులను సేకరించి, సరఫరా చేయగలుగుతున్నారు. ఇప్పుడు ఈ కార్యక్రమంలో మిత్రులు, కుటుంబాల పరంగా తెలిసిన రైతులందరినీ చేర్చేందుకు వీలుగా విస్తరణ బాట పట్టింది.

## లాక్ డౌన్ వేళ.. మరిన్ని శక్తిసామర్థ్యాల సాధన

ఇప్పటికే కొన్ని సంవత్సరాలుగా సేంద్రీయ సేద్యం చేస్తున్న రైతులనుంచి బియ్యం, ఇతర ధాన్యాల సేకరణకు ప్రమీల నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా వాట్సప్ వేదిక సాయంతో (గ్రోయర్ టు బాంద్రా హోమ్స్ - రైతు చేను నుంచి నగర నివాసి వరకు) రైతులు తమ ఉత్పాదనల విశేషాంశాలను వెల్లడించే అవకాశం కల్పించారు. రైతులు స్వయంగా తమ ఉత్పాదనలపై అందచేసిన వివరాల కారణంగా ఉత్పత్తిదారులపై వినియోగదారులకు, వారి మధ్య పరస్పర విశ్వాసం, నమ్మకం పటిష్టంగా తయారయ్యాయని ఆమె వివరించారు. ఉదాహరణగా - ఈ వేదిక ద్వారా తన ఉత్పాదనను విక్రయించుకోగలిగిన సుశీల్ బోర్కర్ అనుభవం ప్రస్తావించారు. సహజంగా వ్యాపారం చేసుకుంటున్న సుశీల్ తనకు సేద్య రంగంపై అమితమైన ఆదరణ అభిమానాలు ఉన్నాయని చెప్పారు. అందువల్ల ఇప్పటికి 30 ఏండ్లుగా ఆయన వారాంతపు రోజులలో వ్యవసాయ పనుల్లో పాల్గొంటున్నారు. ప్రకృతి సహజమైన వాతావరణంలో గడపాలనే ఆయన కోరికే ఇందుకు ప్రధానమైన ప్రేరణ. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)

విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయనకు ఈ విషయంలో పూర్తి అభిలాష ఏర్పడింది. ఆయన సేద్యం పనులలో రసాయనిక ఎరువులను కానీ, క్రిమిసంహారకాలను కానీ ఉపయోగించడానికి ఇష్టపడరు. తన పొలంలో పర్యావరణ అనుకూల వ్యవసాయం చేయడమే ఆయనకు ఎక్కువ ఇష్టం. ఆయన తన ఉత్పత్తుల గురించి వాట్సప్ గ్రూపులో ఈ విధంగా వివరణ ఇచ్చారు.

''ఈ వారాంతంలో మా సొంత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఉత్పత్తులను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసామని తెలియజేయడం చాలా సంతోషం కలిగిస్తోంది. పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ప్రభోధించిన ప్రకృతి సహజ సూత్రాలకు (ఎస్‌పీఎస్‌ఎఫ్) కట్టుబడి పండించిన ఉత్పత్తులు ఇవి. సేద్యంలో భాగంగా గోబర్ గ్యాస్ ఆధారిత ఘనామృత, జీవామృతం వంటివి మాత్రమే ఉపయోగిస్తాం. వాటి తయారీకి వీలుగా 18 దేశీయ పశుసంపద (ఆవులు, ఆంబోతులు, యుక్త వయసులో ఉన్నవి)ను ఉపయోగిస్తున్నాం. ఆవుల నుంచి పాలను పిండుకోం. మా ఉత్పాదనలన్నీ వంద శాతం ఎస్‌పీఎస్‌ఎఫ్ సూత్రాల ప్రకారమే (సహజ సేంద్రీయ విధానంలో) తయారుచేస్తుంటాం.

మేం పండించే మామిడి పండ్లలో మూడు రకాలుంటాయి. హాపూస్ రకం (మా తోటలో 80 శాతం ఈ రకానికి చెందినవే). రత్నా (10 శాతం) రకం, కేశర్ రకం (10 శాతం), మామిడి కాయల సేకరణ చివరి క్షణంలోనే జరుగుతుంది. అంటే కాయ చెట్ల మీద ఉన్న సమయంలో పూర్తిగా పండిపోయేందుకు అవకాశం ఉంటుంది. వాటిని మరింత మాగబెట్టేందుకు వరి పొట్టు ఉపయోగిస్తాం. అందువల్ల మేం నిఖార్సయిన పండ్లనే అంటే పూర్తిగా మాగిన / పాక్షికంగా మాగిన వాటినే మీకు చేరవేస్తాం. కనీసం 8 డజన్లు ఆర్డరివ్వాల్సి ఉంటుంది. మామిడి పండు సైజును +1/-1గా పరిగణించండి.''

పండించిన వాళ్లే కాకుండా వినియోగదారులు కూడా ఈ వేదిక ద్వారా కొనుగోలు చేసిన, వినియోగించిన ఉత్పత్తులపై తమ అమూల్యమైన అభిప్రాయం వ్యక్తంచేయవచ్చు. వారి అభిప్రాయాలు ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పిస్తుంది. వినియోగదారులలోనూ, రైతులలోనూ కూడా సరైన అవగాహన పెంచడానికి తోడ్పడతాయి. సీజన్ ఆధారంగా పండించే విధానం వల్ల కూడా ఏ మాసంలో ఏ పంట అందుబాటులోకి వస్తుందో కూడా గుర్తించగలుగుతున్నామని దీప్తి తెలిపారు.

## స్థానిక ఉత్పత్తుల సరఫరా వ్యవస్థలో భాగస్వామ్యం

ఈ గ్రూపులోని సభ్యులు రైతులనుంచి ఏకమొత్తంలో కొనుగోలు చేయడం, సేకరించిన సరుకును తమ పరిధిలో పంచిపెట్టుకోవడం కోసం అదనంగా మరో బాధ్యతను కూడా చేపట్టారు. ఇలా చేయడం వల్ల, తన పొలం దగ్గర నుంచి నగరాలకు పదేపదే ప్రయాణించవలసిన భారం రైతుకు తప్పిపోతుంది.



*తమ ఇంటి మిద్దెపై పెంచిన మొక్కల ఫలాలతో నిండిన బాస్కెట్‌ను చూపిస్తున్న దీప్తి*

ఉత్పత్తిపై ఆసక్తి లేకుండా కేవలం ఫలితం అందుకునే సాధారణ వినియోగదారులకు భిన్నంగా వినియోగదారులు కొంతమేరకు దానిపై యాజమాన్యపు బాధ్యతను తీసుకునేందుకు ఈ పద్ధతి ఉపయోగకరంగా ఉంది. రైతుల పట్ల వినియోగదారులలో సహానుభూతి పెంపొందింది. ఉదాహరణకు కొన్ని పండ్లు, ఉల్లిపాయల కొనుగోలు విషయంలో రైతులతో ఈ గ్రూపు అనుసంధానం అయింది. సేకరించిన ఉత్పత్తిని తమ గ్రూపు సభ్యులందరూ తమలో తాము పంపిణీ చేసుకున్నారు.

దీని అర్థం పంపిణీ కార్యక్రమం ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా సాగుతున్నదని అనుకోరాదు. కొన్ని సమయాలలో సరఫరా సమస్యలు, ఉత్పత్తుల నాణ్యత ప్రాతిపదికగా పంపిణీ కష్టతరం కావచ్చు. అయినా, ప్రమీల చురుగ్గా ముందుండి నడిపిస్తున్నారు. ఉత్పత్తిదారులను లేదా సేకరణకర్తలను సమన్వయం చేసేందుకు ఆమె ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకు ముఖ్య కారణం - పంపిణీ గొలుసు పనితీరు, వినియోగదారుల ఆలోచనా సరళి ఆమెకు పూర్తిగా అవగాహనకు వచ్చి ఉండడమే. తన ఆలోచనలను ఇతరులకు కూడా తెలియజేయడం ద్వారా వారిలో కూడా సరైన అవగాహన పెంపొందించడం వల్ల వారంతా కూడా ఉత్పత్తి క్రమంలో ఆసక్తి చూపించగలుగుతున్నారని ఆమె తెలిపారు.

## ఫీడ్ బ్యాక్, సాధికారిత పరస్పర ఆధారితాలు

రైతులతో నిత్యం అనుసంధానమై ఉండడం, వారి నుంచి వారి ఫీడ్ బ్యాక్ సేకరించడం జరుగుతూ ఉంటుంది. ఫలితంగా, గ్రూపు సభ్యులలో సాధికారత ఏర్పడి, సమష్టి కృషితో తమ అవసరాలను వారు తీర్చుకోగలుగుతున్నారు.

''మా గ్రూపు సభ్యులలో ఉల్లి కొనుగోలు చేసిన వారంతా అమిత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తారు. ఎందుకంటే ఆయన ఉల్లి సాగు చేసే రైతు అవితో అనుసంధానంతో ఉండి, ఉల్లి సేకరణ, పంపిణీ కార్యక్రమాలను సజావుగా సాగేందుకు తోడ్పడుతున్నారు. వీరంతా అంటే అమిత్, అవి ఇంకా మరో రైతు కలిసి వేసవిలో 6 టన్నుల ఉల్లి పంటను తక్కువ ధరలకు వ్యాపారులకు విక్రయించేందుకు నిరాకరించారు. వారు తమం తట తాము సరుకును ముంబయి మార్కెట్‌కు చేరవేయాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా గతవారంలో 1500 కిలోల ఉల్లిని మార్కెట్‌కు చేర్చగలిగారు. అందులో మా వంతు కేవలం 100 కిలోలు మాత్రమే అయినా సరుకు నాణ్యమైనది లభించింది. పూర్తి సంతృప్తి లభించింది.''

కొబ్బరి, పచ్చళ్లు వంటి స్వల్ప పరిమాణం ఉన్న సరుకు విక్రయం లో కూడా మా గ్రూపు మద్దతు అందించింది. ఆ రకంగా అత్యద్భుతమైన సరఫరా చెయిన్ ఏర్పాటు చేయగలిగింది.

## స్థానికుల ప్రేరణతో రైతు ఉత్పత్తులకు చేయూత

ఈ విధంగా పట్టణ ప్రాంతాలలోని పట్టణ సేద్య స్ఫూర్తి అటు రైతులకు కొండంత అండగా నిలుస్తోంది. ధర విషయంలో లేదా నాణ్యత విషయంలో పట్టు విడుపుల ధోరణి చూపిస్తున్నారు. అందుకు స్థానికంగా రైతులు ఎదుర్కొనే వాతావరణపరమైన ఒడిదుడికుల విషయంలో అవగాహన పెరగడమే. ఎప్పటికప్పుడు అందుతున్న ఫీడ్ బ్యాక్, ముఖాముఖీ సంప్రదింపులు భాగస్వామ్యం సజావుగా సాగేందుకు తోడ్పడుతోంది. అంటే భాగస్వాములైన రైతులు, వినియోగదారులు కూడా ఏదో తమ పని తాము చేసేస్తామన్నట్లుగా కాకుండా, పరస్పర అవగాహనతో వ్యవహరించడం సాధ్యమవుతోంది. ఇలా ఉభయుల మధ్య సరైన అనుబంధం, పరస్పర విశ్వాసం అందరికీ సంతృప్తినిస్తోంది. వినియోగదారులకు నాణ్యత, రైతులకు సరసమైన ధర.

కమ్యూనిటీ పరంగా చేపట్టిన ఈ సమష్టి కృషి కారణంగా పట్టణాలలోని వినియోగదారులలో పెరిగిన చైతన్యం రైతుకు అవసరమైన గిరాకీని సిద్ధం చేస్తోంది. వారి వ్యవసాయం సుస్థిరం గా సాగేందుకు అనుకూలిస్తోంది. ఉత్పత్తిదారులు, మార్కెట్ వ్యవస్థలు, స్వచ్ఛందం సంస్థలు చురుకుగా ఉంటూ భాగస్వామ్యం పటిష్టం చేసి, సరఫరా చెయిన్ మెరుగుపరచేందుకు, ఆర్థిక లావాదేవీల సజావు నిర్వహణకు తోడ్పడుతున్నాయి. వస్తు మార్పిడి పద్ధతి, స్వచ్ఛంద శ్రమదానం, వనరుల సమీకరణ రూపంలో లాభదాయకంగా మారుతున్నాయి. మౌలిక వసతుల కల్పన, వనరుల సేకరణ విధుల వల్ల తోటల నిర్వహణ భారం కూడా భాగస్వామ్య పక్షాల మధ్య సఖ్యతకు దోహదం చేస్తోంది. అయితే ఇది మరింత విస్తరించి పట్టణం మొత్తానికి ఉపయోగకరంగా, సిటీ ప్లానింగ్‌లో భాగంగా మారితే మరింత ప్రయోజనకరమవుతుంది. పట్టణాలలో వ్యవసాయ క్షేత్రాలు విస్తరించినట్లయితే, స్థానిక రైతులలోను, వినియోగదారులలోనూ చైతన్యం పెరగడమేకాక, సరఫరా వ్యవస్థ పటిష్టమవుతుంది. ఈ రకంగా పట్టణ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని అర్బన్ గార్డెన్స్ ప్రయోగం అందరికీ లాభదాయకమవుతుంది. ◆

## రిఫరెన్సెస్

Dutta, D., & Chandrasekharan, S. (2018). Doing to being:farming actions in a community coalesce into proenvironment motivations and values. Environmental Education Research,24(8), 1192-1210. Parnell, S., Elmqvist, T., McPhearson, T., Nagendra, H., & Sörlin, S. (2018). Introduction: Situating knowledge and action for an urban planet. The urban planet: knowledge towards sustainable cities, 1-16.

**Deborah Dutta**
Senior Research Fellow
Living Farm Incomes Project
Institute of Rural Management Anand-388001
E-mail: deborah@irma.ac.in; debbiebornfree@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 22, సంచిక 3, సెప్టెంబర్ 2020